


అమరావతి గౌరవం నిలిచింది. పార్లమెంట్ ఆమోదంతో రాజధానికి చట్టబద్ధత దక్కింది. రైతుల దీర్ఘకాల పోరాటం ఫలించింది. మోదీ, అమిత్ షా సహకారం, చంద్రబాబు, లోకేష్ పట్టుదల ఈ విజయానికి కారణమయ్యాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 03.04.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 346 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్



- ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా... పెండింగ్ బిల్లులను చెల్లించాలని సీఎం ఆదేశం
- బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి సూచన
- పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆర్థిక శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. సీఎం సూచనల మేరకు కసరత్తు చేశామని... నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు. ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ. 7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ. 1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ. 76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ. 3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ. 1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి మిగతా 3లో...

## అమరావతికి పార్లమెంట్ చట్టం ... తిరుగు లేని శాసనం

- బిల్లు ఆమోదంతో ప్రజా సంకల్పానికి గౌరవం
- రాజధానికి వ్యతిరేకంగా వాకౌట్ చేసిన వారిని బ్లాక్ అవుట్ చేయాలి
- మావిగన్ అంటూ రాజధానిపై అపహాస్యమా.?
- అమరావతి రైతులతో సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సతీసమేతంగా దీపహారతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో తిరుగులేని శాసనం చేశారని.. ఇది ప్రజా సంకల్పానికి దక్కిన గౌరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెం వద్ద గురువారం రైతులతో కలిసి సతీ సమేతంగా అమరావతికి దీపహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "దేశ చరిత్రలో అమరావతి విజయం సువర్ణ అక్షరాలతో లిఖించదగింది. అమరావతి చరిత్ర శాశ్వతం.. అందులో రైతులు చేసిన త్యాగం శాశ్వతం. అనేక కుట్రలను ఎదుర్కొని రాజధానిని దక్కించుకున్నాం. రాజధానిని స్మశానం అన్నవారు నేడు అడ్రస్ లేకుండా పోయారు. అమరావతిపై పార్లమెంటులో తిరుగులేని శాసనం చేసుకున్నాం. ఇప్పటి వరకు రాష్ట్రానికి అడ్రస్ లేదు, కానీ నేడు ఒక శాశ్వత అడ్రస్ వచ్చింది. అమరావతి రాజధాని ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నం. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చి చేసిన త్యాగం వల్లే ఈ విజయం సాధ్యమైంది. 1,631 రోజుల ఉద్యమం ఒక చరిత్ర. ఉద్యమాన్ని అడ్డుకున్న ప్రభుత్వంపై రాజధాని రైతులు, మహిళలు వీరత్వం, ప్రతాపం చూపారు. నాడు ముళ్ల కంచెలు దాటుకుని ఉద్యమం చేస్తున్న రైతుల వద్దకు పవన్ కళ్యాణ్ వచ్చారు. భువనేశ్వరి తన చేతికి ఉన్న రెండు గాజులను రాజధాని రైతుల ఉద్యమానికి విరాళంగా ఇచ్చారు. ఎంతో మంది రైతులకు అండగా నిలిచారు. అమరావతి ఉద్యమం కోసం నేను స్వయంగా జోలె పట్టాను. న్యాయస్థానం టు దేవస్థానం కార్యక్రమాన్ని నాటి ప్రభుత్వం అడ్డుకుంది. ఒక్క అడుగూ వెనక్కుక తగ్గినా... తర్వాత పది అడుగులు వేసి సింహాల్లా దూకారు. 2024లో కూటమి పార్టీకి అద్భుత విజయం అందించారు... ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత కలిగింది. రైతులు, రైతు కూలీలు, ప్రజల ఐకమత్యం వల్లే ఈ విజయం సాధించుకున్నాం. 2019లో ఏమార్చారు. ఐదేళ్ల పాటు చీకటి రోజులుగా రాష్ట్రానికి దాపురించాయి. 3 లో..



## థ్యాంక్యూ ప్రధాని నరేంద్ర మోదీ జీ



- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వంలోని లోక్ సభ, రాజ్యసభల్లో అమరావతికి చట్టబద్ధత లభించిన క్రమంలో థ్యాంక్యు ప్రధాని నరేంద్ర మోదీజి అనే నినాదంతొ టిడిపి శ్రేణులు, అమరావతికి, కూటమి నేతలకు జై కొడుతు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సారధ్యంలొ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ప్రధాని మోదీజికి ధన్యవాదాలు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయం నుండి మార్కెట్ సెంటర్ లోని, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. థాంక్యూ మోడీ జీ నినాద బ్యానర్ వాహనం,ర్యేలీని ముందుకు నడిపించింది.

ఈక్రమంలొ టిడిపి శ్రేణులు దారి పొడవునా బాణా సంచా పేల్చిన తమ హర్షం వెలిబుచ్చారు.

ర్యాలీ లో బిజెపి నాయకులు, టిడిపి నియోజక వర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతు పార్లమెంట్ లో, మన ఎమ్ పి. పెమ్మసాని చంద్ర శేఖర్ బిల్లును పెట్టారని, మిగతా 2లో...

## ఆర్టీపీపీలో రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి



- ఏపీ జెన్కో ఇంజనీర్లకు అభినందనలు
- సమిష్టి కృషితో తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ సరఫరా
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో ఏపీ జెన్కో మరో సరికొత్త రికార్డును నెలకొల్పింది. మిగతా 2లో...

## 5 కోట్ల ఆంధ్రులు గెలిచిన రోజు

- టీమ్ -11 మినహా యావత్ భారతదేశం అమరావతికి అండగా నిలిచింది
- అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కృషిచేసిన అందరికీ ధన్యవాదాలు
- రాజధాని పనులు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగానే ప్రారంభిస్తాం
- న్యూఢిల్లీ విలేకరుల సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్



2లో

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఈరోజు చరిత్రలో నిలబడే రోజు... 5 కోట్ల ఆంధ్రులు గెలిచిన రోజు... అమరావతి రైతులు గెలిచిన రోజు... అమరావతి మహిళలు గెలిచిన రోజు అని రాష్ట విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల సమస్య లేదని నిర్మాణ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్ పోలవరం ప్రాజెక్టు సందర్శన నేపథ్యంలో ప్రాజెక్టు పనుల పరిశీలనకు వచ్చిన నిమ్మల గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ ప్రాజెక్టు పనులు కొలిక్కి తెస్తున్నామన్నారు. మిగతా 3లో...

## ఆంధ్రుల హృదయాల్లో చిరస్థాయిగా ప్రధాని మోదీ

- అమరావతికి చట్టబద్ధతలో మోదీ కీలక పాత్ర
- పార్లమెంట్ ఆమోదంతో అమరావతి రాజధాని... అభివృద్ధికి మార్గం సుగమం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆనంద వాతావరణం నెలకొంది. ఉద్దండరాయునిపాలెంలో నిర్వహించిన అమరావతి సంబరాలు ఉత్సాహభరితంగా సాగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు నేతలు, రైతులు భారీగా హాజరయ్యారు. మిగతా 3లో...



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి చట్టబద్ధత దిశగా కీలక ఘట్టం పూర్తయింది. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లుకు రాజ్యసభ కూడా పచ్చజెండా ఊపింది. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో అమరావతికి తిరుగులేని మద్దతు దక్కింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ బిల్లును కేంద్రమంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. సభ్యుల సమ్మతితో రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాక్రిష్ణన్ బిల్లుపై చర్చకు ఆమోదం తెలిపారు.

అమరావతికి చట్టబద్ధతకు కాంగ్రెస్, BJP, TDP, ఆప్, తృణమూల్, BJD, JDU, RJD, BRS, ఉద్ధవ్ శివసేన పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి రామ్మోహన్?



నాయుడు తెలుగు ప్రజలందరికి ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని అన్నారు. "బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి చరిత్రలో గుర్తుంటుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. మిగతా 3లో...

## ఆలపాటి ఎడ్ల బల ప్రదర్శన పోటీల ప్రాంగణంలో హోరెత్తిన అమరావతి సంబరాలు



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తొమ్మిదోసారి నిర్వహిస్తున్న ఈ ఎడ్ల బల ప్రదర్శన పోటీలు విశిష్టతను చాటుతున్నాయి. గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ జారీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రైతు సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఐదో రోజు ఈ కార్యక్రమం అమరావతి సంబరాలతో మరింత ఉత్సాహభరితంగా మారింది. అమరావతికి పార్లమెంట్‌లో చట్టబద్ధత లభించిన శుభసందర్భంగా తెనాలిలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వహిస్తున్న ఎడ్లబల ప్రదర్శన పోటీల ప్రాంగణం ఆనందోత్సాహాలతో మార్మోగింది. ఎక్కడ చూసినా సంబరాల సందడి, రైతుల కేరింతలు, నాయకుల సందేశాలతో ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రజలు, రైతులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుని రాజశేఖర్ తదితర నాయకులు రైతులతో కలిసి క్యాండిల్స్ వెలిగించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఎన్టీఆర్, ఆలపాటి శివరామకృష్ణయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం మొత్తం అమరావతి సాధనలో రైతుల పాత్రను స్మరించుకునేలా సాగింది.

ఈ సందర్భంగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, "అమరావతికి చట్టబద్ధత లభించడం ప్రతి ఆంధ్రుడి కల నిజమైన క్షణం. ఇది కేవలం ఒక రాజకీయ నిర్ణయం కాదు, రైతుల త్యాగాలకు లభించిన గౌరవం" అని పేర్కొన్నారు. మిగతా 2లో...



## థ్యాంక్యూ ప్రధాని నరేంద్ర మోదీ జీ



(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, లోక్ సభలో, రాజ్యసభలో నెగ్గామని అన్నారు. తెనాలి గడ్డకు ఉన్న పోరాట స్ఫూర్తిని వివరించారు. నాడు చంద్రబాబును తెనాలి గడ్డపై అడుగు పెట్టనీయబోమన్న వారి, ప్రగల్భాలను తిప్పి కొట్టాం. మార్కెట్ సెంటర్ కు తీసుకు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోదీజి కి ధన్యవాదములు తెలిపారు. ఎమ్మెల్సీ పేరాబత్తుని రాజశేఖర్ మాట్లాడుతు మాజీ ముఖ్యమంత్రి జగన్ వైఖరిని సునిశితంగా విమర్శించారు జగన్ చెప్పిన మావిగన్ మడిచి పెట్టుకో మన్నారు. వారి పాలనలో అమరావతి పై విషం చిమ్మిన తీరు వివరించారు. జగన్ మతిభ్రమించి మాట్లాడు తున్నాడని, అమరావతి దేవతల రాజధాని అని, అక్కడ జగన్ కాలు పెట్ట కుండా ప్రజలు బెంగుళూరుకు పంపాలన్నారు. వర్ధిల్లాలి కూటమి నాయకత్వం అంటూ నినాదాలు చేశారు. బిజెపి నాయకులు టి. అనంతాచార్యులు అమరావతికి చట్టబద్ధత లభించడం పట్ల హర్షం వెలిబుచ్చారు. పట్టణ పార్టీ అద్యక్షులు కుద్దూస్ వందన సమర్పణ చేశారు. పార్టీలోని సీనియర్ నాయకులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీపీపీలో రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు అత్యధిక విద్యుత్ ఉత్పత్తిని సాధించింది. 1,650 మెగావాట్ల ఆర్టీపీపీ మొత్తం సామర్థ్యానికి గానూ, బుధవారం నాడు 1,643 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించింది. ఆర్టీపీపీ తొలిసారి ఈ రికార్డు సాధించడం పై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీపీపీ ఇంజనీర్లను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్లాంట్ చరిత్రలో తొలిసారిగా 99.58 శాతం ప్లాంట్ లోడింగ్ ఫ్యాక్టర్ (గ్రాఫ్) నమోదు చేయడం ఏపీ జెన్కో సాధించిన ఘన విజయమని మంత్రి గొట్టిపాటి కొనియాడారు. సీఎం ఆశయ సాధన దిశగా అహర్నిశలు శ్రమిస్తున్న జెన్కో ఇంజనీర్ల అంకితభావం వల్లే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కేవలం విద్యుత్ ఉత్పత్తిలోనే కాకుండా, వినియోగదారులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు డిస్కంలు, ట్రాన్స్ కో ఇంజనీర్లు కూడా సమిష్టిగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## ఆలపాటి ఎడ్ల బల ప్రదర్శన పోటీల ప్రాంగణంలో హోరెత్తిన అమరావతి సంబరాలు







**(మొదటి పేజీ తరువాయి)** రైతులు ఇచ్చిన భూములపై ఏర్పడిన రాజధానికి ఇప్పుడు చట్టపరమైన భద్రత లభించడం సంతోషకరమన్నారు.

ఎమ్మెల్సీ పేరాబత్తుని రాజశేఖర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విశ్వాసంతో రైతులు వేల ఎకరాల భూములు ఇచ్చారని, ఇప్పుడు ఆ విశ్వాసానికి న్యాయం జరిగిందని చెప్పారు. “నేను కూడా రైతు కుటుంబం నుంచే వచ్చాను. రైతుల కష్టాలు నాకు తెలుసు. ఈ నిర్ణయం వారి భవిష్యత్తుకు ఒక భరోసా” అని భావోద్వేగంగా అన్నారు.

ఇదిలా ఉండగా, సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన ఎడ్లబల ప్రదర్శన పోటీలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. న్యూ కేటగిరిలో జరిగిన పోటీల్లో ఆర్కే బుల్స్ (కోమలి జయరామ్ – కాలిఫోర్నియా ప్రతినిధి) ఎడ్లజత 5567.6 అడుగులు బండి లాగి ప్రథమ బహుమతి రూ. 70,000 గెలుచుకుంది. ఇర్లంపాడు సర్పంచ్ మంగురమాదేవి ఎడ్లజత 5100 అడుగులతో ద్వితీయ బహుమతి రూ. 50,000 అందుకుంది. మోదుగుల రామిరెడ్డి (పెదపరిమి) ఎడ్లజత 4803.7 అడుగులతో నాలుగో బహుమతి రూ. 35,000 గెలుచుకుంది.

అలాగే అర్కే బుల్స్, గోనా నరశింహారెడ్డి ఉమ్మడి ఎడ్లజత 4593.7 అడుగులతో ఐదో బహుమతి రూ. 30,000, రామినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత 4594.9 అడుగులతో ఆరవ బహుమతి రూ. 25,000 సాధించాయి. యల్లం సాంబశివరావు – సుఖవాసి సతీష్ బాబు ఉమ్మడి జత 4274 అడుగులతో ఏడో బహుమతి రూ. 20,000 గెలుచుకుంది. ఆర్వీఎస్ బుల్స్ జత 3607.3 అడుగులతో ఎనిమిదో బహుమతి రూ. 15,000, షేక్ బడే పురుషోత్తం ఎడ్లజత 3075 అడుగులతో తొమ్మిదో బహుమతి రూ. 10,000 కైవసం చేసుకున్నాయి. విజేతలకు అతిథులు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేసి ఘనంగా అభినందించారు. కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను తిలకించారు.

బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ, “రైతుల్లో ఉత్సాహాన్ని పెంచేలా, సంప్రదాయాన్ని కాపాడేలా ఈ ఎడ్లబల పోటీలు నిర్వహించడం అభినందనీయం. అమరావతి బిల్లు ఆమోదంతో రాజధాని ఆశలు మళ్లీ చిగురించాయి” అని అన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ, “రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. ఒంగోలు జాతి ఎడ్లను సంరక్షించడం మనందరి బాధ్యత” అని పిలుపునిచ్చారు. మొత్తానికి అమరావతి చట్టబద్ధత ఆనందం, ఎడ్లబల పోటీల ఉత్కంఠ – ఈ రెండూ కలసి తెనాలి ప్రాంగణాన్ని కోలాహలంతో నింపి నిజమైన పండుగ వాతావరణాన్ని సృష్టించాయి.

### అమరావతి చట్టబద్ధతలో మోదీ కీలక పాత్ర...

## మోదీపై ఆంధ్రుల విశ్వాసం



- **బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తోరణంగా నిలిచే రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో బీజేపీ-జనసేన కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాయని పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకురావడం, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అభివృద్ధి దిశగా స్పష్టమైన అడుగులు వేస్తున్నారని అన్నారు. లోకేష్ చేపడుతున్న కార్యక్రమాలు కూడా రాష్ట్ర ఆర్థిక పురోగతికి దోహదపడుతున్నాయని వివరించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం, ప్రేమ చూపిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి నిర్మాణం ద్వారా రాష్ట్రానికి పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

మాజీ ముఖ్యమంత్రి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ పాలనలో నియంతృత్వ ధోరణులు కొనసాగాయని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రజలు ఆ విధానాలను గుర్తించి తిరస్కరించారని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోరుకునే వైఎస్సార్సీపీ నాయకులు తక్షణమే ఆ పార్టీని వీడాలని సూచించారు. రాష్ట్ర నాశనమే లక్ష్యంగా పనిచేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

ప్రస్తుతం కేరళలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అహికోడ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న తాడువాయి రామకృష్ణ ఈ ప్రకటన విడుదల చేశారు.

## అమరావతి కి చట్టబద్దత బిల్లు ఆమోదం పొందడం పై కూటమి శ్రేణుల హర్షం

- **శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం లో 108 టెంకాయలు కొట్టి, ప్రత్యేక పూజలు**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతి కి చట్టబద్దత కల్పించే బిల్లు మెజారిటీతో ఆమోదం పొందడం పై మంగళగిరిలో గురువారం రాత్రి కూటమి శ్రేణుల హర్షం వ్యక్తం చేస్తూ బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఎంఎస్ఎస్ భవన్ నుండి ర్యాలీ నిర్వహించి లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయానికి చేరుకుని నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు మాజేటి సూర్య వేణు గోపాల కృష్ణ శ్రేష్టి ఆధ్వర్యంలో నూట ఎనిమిది టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజధాని కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు, పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతి కి మద్దతుగా నిలిచిన అందరికి ధన్యవాదములు తెలుపుతున్నాము, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికి, మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు, రాజధాని రైతుల పోరాటం నేడు ఫలించింది అన్నారు. మూడు రాజధానులు అంటూ గత ప్రభుత్వం ప్రాంతాల మధ్య చిచ్చు యత్నం చేసింది, 11 సీట్లకు జగన్ పరిమితమైనా మార్పు రాలేదు, మావిగన్ అని జగన్ కొత్త నాటకానికి తెరదీశారని తెలిపారు. అమరావతి నిర్మాణానికి అడ్డంకులు తొలగించడమే కాకుండా, భవిష్యత్తుల ఎవరూ అడ్డుకోలేని విధంగా బలమైన పునాది వేసేలా చేసిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ టీడీపీ అధ్యక్షులు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, పట్టణ బీజేపీ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, టీటీడీ బోర్డు మెంబెర్ తమ్మిశెట్టి జానకిదేవి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరి రావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐదుకోట్ల ఆంధ్రులు గెలిచిన రోజు




(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఆంధ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు...తొలుత మనందరం మద్రాసు రాజధానిగా మద్రాసు స్టేట్ లో ఉన్నాం... దాని తర్వాత పొట్టి శ్రీరాములు చేసిన 58రోజుల దీక్ష, ప్రాణత్యాగం వల్ల భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అందులో భాగంగా కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. 3సంవత్సరాల తర్వాత ఒక ఒప్పందం వల్ల మళ్లీ తెలంగాణా, ఆంధ్ర కలిపి హైదరాబాద్ రాజధానిగా రాష్ట్రం ఏర్పాటైంది. 58సంవత్సరాలు కష్టపడి, చెమటోడ్చి అటు తెలంగాణా, ఇటు ఆంధ్రప్రజలు కలసికట్టుగా హైదరాబాద్ ను అభివృద్ధి చేసుకున్నాం. ఒక చీకటిరోజు పార్లమెంటులో ఎలాంటి చర్చ జరగకుండా టివిలు కట్టేసి, తలుపులు మూసేసి ఆంధ్రరాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించారు.

**మెడపట్టి బయటకు గెంటేశారన్న బాధ ఉంది :** ఆనాడు చంద్రబాబునాయుడు ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో రెండు ప్రాంతాలకు న్యాయం చేసి ముందుకువెళ్లండి, లేకపోతే విభజన వల్ల ఒక ప్రాంతం లబ్ధి పొందినా మరో ప్రాంతం తీవ్రంగా నష్టపోతుంది చెప్పారు. అయినా వినకుండా ఏకపక్షంగా ఆంధ్రరాష్ట్రాన్ని విభజించారు. నేను పుట్టిపెరిగింది తెలంగాణాలోనే, హైదరాబాద్ లో ప్రతి గల్లీ నాకు తెలుసు. అయితే ఆరోజున కట్టుబట్టలతో మెడబట్టి బయటకు గెంటేశారన్న బాధ, ఆవేదన కలిగింది. రాజధాని ఎక్కడ పెట్టాలో తెలియదు, కూర్చునేదానికి సెక్రటేరియట్ లేదు. శాసనసభ సమావేశాలు నిర్వహించుకునేందుకు అసెంబ్లీ లేదు, హైకోర్టు లేదు. పదేళ్లు హైదరాబాద్ మీ రాజధాని, ఆ తర్వాత మీదారి మీరు వెతుక్కోండి అని సింపుల్ గా చెప్పేశారు.

**అశాస్త్రీయ రాష్ట్ర విభజన దారుణం :** విభజన ఎంత దారుణంగా జరిగిందంటే షెడ్యూల్ 9, 10 సంస్థలు ఇప్పటికీ అటు తెలంగాణా, ఇటు ఆంధ్ర రాష్ట్రానివో తేలని దుస్థితి నెలకొంది. అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల ఇప్పుడు కూడా తెలుగుప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆనాడు హైదరాబాద్ లో గల శాసనసభలో ఏపీ అసెంబ్లీ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా స్పష్టంగా అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు సమదూరంలో రాజధాని ఉండాలి, ఆ రాజధాని అమరావతి అని ఆనాడు ప్రకటించారు. ఆ సమయంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపిస్తామని చెప్పారు. అందులో భాగంగా రైతులు ముందుకొచ్చారు, ప్రధానమంత్రి స్వయంగా వచ్చి అమరావతి పనులకు శంకుస్థాపన చేశారు. ఆనాడు రైతులకు తెలుగుదేశం, బిజెపి, జనసేన, చివరకు వైసిపి కూడా భరోసా ఇచ్చాయి, అందరూ అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపారు. అందుకే 5కోట్ల ఆంధ్రుల కోసం తమ భూములు రాజధాని కోసం ఇస్తున్నామని అక్కడి రైతులు చాలా స్పష్టంగా చెప్పారు.

**మూడు ముక్కలాటపై అలుపెరుగని పోరాటం :**

2019 ఎన్నికలకు ముందు మేము చాలా స్పష్టంగా ప్రజలకు చెప్పాం. పొరపాటున ప్రభుత్వం మారితే అమరావతి రాజధానిగా ఉండదు, తరలిస్తారని చెప్పాం. ఆనాటి ప్రతిపక్షనేత, ప్రస్తుత పులివెందుల ఎమ్మెల్యే జగన్ తాను ఇక్కడే ఇల్లు కట్టుకున్నాను, రాజధానిని ఎక్కడకూ తీసుకెళ్లనని చెప్పి ప్రజలను మోసగించారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిపై అనేక ఆరోపణలు చేసి మూడుముక్కలాట మొదలుపెట్టారు. ఆరోజు శాసనసభలో మా ఎమ్మెల్యేలు పోరాడారు, కౌన్సిల్ లో మాకు మెజారిటీ ఉంది. కౌన్సిల్ సాక్షిగా మేమంతా పోరాడాం. నేను కూడా ఆనాడు శాసనమండలిలో ఎమ్మెల్సీని. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని సభ్యులమంతా కోరినా... అప్పటి లెజిస్లేటివ్ ఎఫైర్స్ మంత్రి బొత్స సత్యనారాయణ చైర్మన్ సంతకం లేకుండా బిల్లు పాసైందని చెప్పి, గవర్నర్ ఆమోదానికి పంపించారు. తెలిసో, తెలియకో గవర్నర్ గారు ఆరోజు పర్మిషన్ ఇచ్చారు. మేము న్యాయపోరాటం చేయగా, వారు తప్పుచేశారని కోర్టు అక్షింతలు వేసింది.

**రైతులను వెంటాడి వేధించారు :**

ఆరోజు నుంచి ప్రజారాజధాని కోసం ఉద్యమం మొదలైంది. పెద్దఎత్తున రైతులు, మహిళలు రోడ్డుపైకి వచ్చి 5కోట్ల ఆంధ్రుల కోసం పోరాడారు. ఉద్యమించినందుకు వారిని అన్నిరకాలుగా అవమానించారు, వారిపై దాడిచేశారు. శాంతియుతంగా వారు అమరావతి నుంచి తిరుమలకు, సింహాచలంకు పాదయాత్ర చేయాలన్నా అనేక ఇబ్బందులు పెట్టారు, అవమానించారు. రాజధాని గ్రామాల్లో ప్రజలు స్వస్థలాల్లో తిరగాలంటే ఆధార్ కార్డు చూపించాల్సిన పరిస్థితులు కల్పించారు, ఐదేళ్లు 144వ సెక్షన్ పెట్టారు. ప్రజలను అన్నిరకాలుగా వేధించారు. 5కోట్ల ఆంధ్రులు అదంతా ప్రత్యక్షంగా చూశారు. అందుకే వారిలో ఆవేదన, బాధ కలిగాయి. ఆనాడు మేం చాలా స్పష్టంగా ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని అమరావతి, అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపిస్తామని చెప్పాం. అదే నినాదంతో మేమంతా ఎన్ డిఎ కూటమిగా గత ఎన్నికల్లో కలసికట్టుగా పోటీచేశాం. అందుకే ప్రజలు 94శాతం మ్యాండేట్ ప్రజలు మాకిచ్చారు. గత పాలకులు ఎక్కడ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ పెడతామని మాయమాటలు చెప్పారో అక్కడే విశాఖప్రజలు మా ఎంపిని అత్యధికంగా 5లక్షల ఓట్లకు పైగా భారీ మెజారిటీతో గెలిపించారు. విశాఖపట్నంతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, హిందూపూర్, అనంతపూర్, చిత్తూరు జిల్లాల ప్రజలంతా అమరావతికే మద్దతుగా నిలిచారు. ఒకేరాష్ట్రం, ఒకే రాజధాని, అమరావతే మా రాజధాని అని తెలుగు ప్రజలు స్పష్టంచేశారు.

**ప్రధాని ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారు :**

ఎన్ డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీమ్ -11 అనేక దుష్ప్రచారాలు చేసింది, ఇప్పుడు కూడా చేస్తున్నారు. మళ్లీ పొరపాటున అధికారంలోకి వస్తే 3రాజధానులు చేస్తామని ఇప్పుడు కూడా చెబుతున్నారు. వారి తప్పుడు ప్రచారం ఆంధ్రరాష్ట్రానికి, అమరావతికి రావాల్సిన పెట్టుబడులు నెమ్మదించాయి. ఇప్పటికే చాలా నష్టపోయాం, మా భవిష్యత్తు ఏమిటని రైతుల్లో కూడా ఆందోళన వచ్చింది. అంధ్రప్రదేశ్ కు అమరావతి ఏకైక శాశ్వత రాజధానిగా చట్టబద్ధత ఉండాలని రైతులంతా కోరారు. అందులో భాగంగా ఒక స్పెషల్ సెషన్ పెట్టుకుని, రోజంతా దీనిపై చర్చించాం. అమరావతే శాశ్వత రాజధానిగా ఉండాలని ఏకగ్రీవంగా శాసనసభలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పార్లమెంటులో బిల్లు పాస్ చేయించేందుకు చొరవచూపారు.

**యావత్ భారతదేశం అండగా నిలబడింది :**

ఒకేఒక్క పార్టీ తప్ప మొత్తం భారతదేశం ఆంధ్ర రాష్ట్రానికి అండగా నిలబడ్డారు. చాలామంది ఈరోజు రాజ్యసభలో మాట్లాడుతూ... అమరావతికి మద్దతివ్వడం ప్రారంభం మాత్రమే, అంతా ఆంధ్రప్రదేశ్ కు అండగా నిలబడాలని, ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంది, అయిదేళ్లు చాలా నష్టపోయింది, టీమ్ -11 పార్టీ మినహా మేమంతా అండగా ఉంటామని అన్నిపార్టీలు కలసికట్టుగా మద్దతునిచ్చాయి. బిజెపి, జనసేన, జెడియు, అటుపక్కన కాంగ్రెస్, టిఎంసి, ఆప్, ఎస్ పి... అందరూ ముక్తకంఠంతో ఎపి శాశ్వత రాజధాని అమరావతి అని మాట్లాడారు. ఈరోజు కూడా రాజ్యసభలో కరెక్టుగా 11పార్టీలు మాట్లాడాయి, గత పాలకులు చేసిన పొరపాట్లకుగాను 11నెంబర్ వారిని వెంటాడుతోంది. ఒకపార్టీ మాత్రం వాకౌట్ చేసింది. అది ప్యాషనో, మరేమిటో సిసిడి (క్రెడిట్ చోరీ డిజార్డర్) ఉన్న వ్యక్తిని మీరంతా అడగాలి. మొత్తం భారతదేశం ఈరోజు ఆంధ్రులకు అండగా నిలబడింది, ఇందుకు రాష్ట్రప్రజలంతా గర్వపడాలి. మాపై ఉంచి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం, తప్పనిసరిగా అమరావతి పనులు పూర్తిచేస్తాం. ప్రధానిమంత్రి మోడీజీని తీసుకెళ్లి నూతన రాజధానికి రిబ్బన్ కటింగ్ చేయించే బాధ్యత ఎన్ డిఎ ప్రభుత్వం తీసుకుంటుంది. 5కోట్ల ఆంధ్రులు గర్వపడేవిధంగా అమరావతిని అభివృద్ధి చేస్తాం. రాజధానితోపాటు అన్నిప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటాం అని లోకేష్ వివరించారు.

**విలేకరుల ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలు:**

**లోక్ సభలో చర్చ టివీలో చూశారు, రాజ్యసభ చర్చ ప్రత్యక్షంగా చూశారు, మీరు ఎలా ఫీలయ్యారు?**

అపోహలు తొలగిపోయాయి. రైతులు, మహిళలు చేసిన పోరాటం ఫలించింది. ఇక అభివృద్ధి దిశగా ముందుకెళ్లబోతున్నాం, నాకు చాలా ఆనందంగా ఉంది. అందుకే ఎంపిలంతా నిలబడి పార్లమెంటుకు నమస్కరించారు. అమరావతిని, 5కోట్ల ఆంధ్రులను కాపాడింది పార్లమెంటే.

**దేశంలోని అన్నిపార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇచ్చాయి కాబట్టి, భవిష్యత్తులో దీనిని కదల్చడానికి అవకాశం లేదని అనుకోవచ్చా?**

నూటికి నూరుశాతం, నేను చెప్పిన మాటలను డేట్, టైమ్ రాసిపెట్టుకోండి. యావత్ భారతదేశం 5కోట్ల ఆంధ్రుల కోసం ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, జై అమరావతి నినదించింది. ఇక ఎవరూ రాజధానిని తాకలేరు.

**తాము వస్తే రాజధాని మారుస్తామని జగన్ అంటున్నారు కదా?**

నిన్న ఆయన ప్రెస్ మీట్ చూసి నాకు డౌటొచ్చింది. నేనే కష్టపడ్డాను, పార్లమెంటుకు బిల్లు తీసుకువచ్చానని అంటాడేమోనని అనుకున్నా. ఎందుకంటే ఆయనకు క్రెడిట్ చోరీ డిజార్డర్ అనే జబ్బు ఉంది. ఆర్సెలర్ మిట్టల్ ప్లాంటు విషయంలో ఆయన చెప్పిన మాటలే ఇందుకు నిదర్శనం. తొలుత ఆ పరిశ్రమ యాజమాన్యం వేరే రాష్ట్రానికి కమిట్ అయింది, లోకేష్ ప్రజలను మోసగిస్తున్నాడని నా పేరును ప్రస్తావిస్తూ చెప్పారు. అదే వ్యక్తి ఫౌండేషన్ తర్వాత దావోస్ నేనే మాట్లాడి ఆ కంపెనీని తీసుకొచ్చానని అన్నారు. ఆయనను ఏమనాలో అర్థంకావడం లేదు. ఇక ఎట్టి పరిస్థితుల్లో ఆయన అధికారంలోకి రాడు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి, ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం. సుదీర్ఘంగా ఒకేపార్టీ అధికారంలోకి ఉండటం వల్లే ఈరోజు గుజరాత్ ఎంతో అభివృద్ధి చెందింది. ఒడిశాలో కూడా అదే జరిగింది. ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి కూడా ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. 21నెలల్లో ఎన్ని పరిశ్రమలు ఏపీకి తెచ్చామో చూడండి. ఇంతలా పెట్టుబడులు వస్తాయని ఎవరైనా ఊహించారా? కాగ్నిజెంట్, గూగుల్, టిసిఎస్, ఇన్ఫోసిస్, సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, ఎసిలు తయారుచేసే కంపెనీలు తీసుకొచ్చాం. భారతదేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను తెచ్చాం, ఇంకా అనేక పరిశ్రమలు రాబోతున్నాయి. ఇవన్నీ రావడానికి మాకు ఒక బ్రాండ్ ఉంది. ఆ బ్రాండ్ పేరే చంద్రబాబునాయుడు.

**జగన్ చెబుతున్న మావిగన్ పై మీ అభిప్రాయం ఏమిటి?**

ఆయన వైజాగ్ లో ఉందామని ఇల్లు కట్టడానికి ప్రయత్నించాడు, దానిని కూడా సరిగా పూర్తిచేయలేక పోయాడు. కేవలం ఒక్క ఇల్లు కట్టలేని వ్యక్తి రాజధాని నిర్మిస్తారా? అయిదేళ్లలో ఆయన రాష్ట్రంలో కనీసం ఒక్క రోడ్డయినా వేశారా? కనీసం గోతులైనా పూడ్చారా? అటువంటి వ్యక్తి ప్లాన్ బి, ప్లాన్ సి, ప్లాన్ డి అంటే ఎవరు నమ్ముతారు. మాది ఒకే ప్లాన్... అది అమరావతి మాత్రమే, అది మారే ప్రసక్తే లేదు.

**అమరావతికి పార్లమెంటులో ఇన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తాయని మీరు ఊహించారా?**

ఆ క్రెడిట్ అంతా ఎన్ డిఎ పార్లమెంటరీ పార్టీకే దక్కుతుంది. మా కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటరీ పార్టీనేత కృష్ణ, హరీష్ తదితర సభ్యులంతా కలసికట్టుగా ప్రతిపార్టీతో సంప్రదించారు, అమరావతి మద్దతు ఎందుకు ఇవ్వాలో అర్థమయ్యేలా వివరించారు. అమరావతి రైతులు పడిన కష్టాలు, అవమానాలు ఇక్కడ చాలామందికి తెలియదు. మా సభ్యులంతా మాట్లాడి పార్లమెంటులో చైతన్యం తెచ్చారు. ఇటీవల ఏ విషయంలోనూ పార్లమెంటులో ఏకాభిప్రాయం రాలేదు, కేవలం ఒకేఒక పార్టీ మినహా భారతదేశం మొత్తం మాకు అండగా నిలబడింది. టిడిపి పార్లమెంటు సభ్యులంతా చాలా కష్టపడ్డారు.

**ఈరోజు ప్రధానిమంత్రిని కలిసి ఏం మాట్లాడారు?**

నేను ప్రధానమంత్రి గారితో ఒక్కటే చెప్పాను. ఈరోజు అమరావతి రైతులు హాయిగా నిద్రపోగలుగుతున్నారు. ఆయన కృషి, ప్రోత్సాహం వల్ల బిల్లు ఆమోదం పొందింది, 5కోట్ల ఆంధ్రుల తరపున ధన్యవాదాలు తెలిపాను. ప్రధాని అందిస్తున్న సహకారం వల్ల అమరావతి, పోలవరం, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి అనేక ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయి. ప్రధాని స్పందిస్తూ వ్యక్తులు, అధికారం శాశ్వతంకాదు, వ్యవస్థ శాశ్వతం. ఆ వ్యవస్థను మనం పటిష్టంగా ముందుకు తీసుకెళ్లాలి. వ్యవస్థలు దెబ్బతింటే దేశం దెబ్బతింటుంది, ఇది కరెక్టుకాదని చెప్పారు. భోగాపురం ఎయిర్ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి, మీరు రావాలని కోరగా, తప్పనిసరిగా వస్తానని చెప్పారు. మా ఎంపిలందరితో ప్రధాని ఈరోజు ఫోటోలు దిగారు. మీరంతా హ్యాపీగా ఉన్నారా అని అడిగారు, ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రరాష్ట్ర ప్రజలు, అమరావతి రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పాం. 2014లో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండి ఏపీకి ప్రచారానికి వచ్చినపుడు ఆయన బిడ్డను బతికించారు, తల్లిని చంపేశారని అన్నారు. ఇప్పటికీ ఆయన ఆ మాటలను గుర్తుపెట్టుకున్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని సొంతకాళ్లపై నిలబడేవరకు ఆదుకోవాలని ఆయన భావిస్తున్నారు. చంద్రబాబు టెక్నాలజీలో వెరీ గుడ్, ఆయన అనుకుంటే ఏదైనా సాధిస్తారు, ప్రాజెక్టులన్నీ గ్రౌండ్ చేస్తే దేశానికి తిరిగి మీరు కంట్రిబ్యూట్ చేయగలుగుతారని చెప్పారు, ఎకనమిక్ యాక్టివిటీస్ వేగవంతంచేసి ముందుకెళ్లాలని చెప్పారు, గతంలో అమిత్ షాను కలిసినపుడు కూడా ఆయన నాకు ఇదే చెప్పారు.

**అమరావతిలో ఎయిర్ పోర్టు, స్పోర్ట్స్ సిటీ పనులు ఎప్పటినుంచి ప్రారంభిస్తారు?**

స్పోర్ట్స్ సిటీ పనులు వెంటనే ప్రారంభిస్తాం, ఎయిర్ పోర్టుకు సంబంధించిన పనులపై దృష్టిసారించాం. ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తాం. నరేంద్ర మోదీ స్టేడియం ఒక్కటే ఉంటుంది, దానితో ఎవరూ పోటీపడలేరు, మరోదానిని సృష్టించడం సాధ్యం కాదు. అయితే మేము కూడా ఒక వరల్డ్ క్లాస్ స్టేడియం నిర్మిస్తాం.

**పార్లమెంటు వేదికగా వైసిపి చేసిన ఆరోపణలను ఏవిధంగా తిప్పకొట్టబోతున్నారు? :** ఆరోపణలు చేసిన వారిని నేను సూటిగా ఒక విషయం అడగాలని అనుకుంటున్నా. ఒక వ్యక్తి బతకడానికి రూ. 700 కోట్లు పెట్టి ప్యాలెస్ కట్టారే, అప్పుడు వారికి అధికంగా ఖర్చుచేస్తున్నామనే ఆలోచన రాలేదా? చదరపు అడుగు 4వేల డిస్కషన్ అప్పుడు ఏమైంది? రుషికొండ ప్యాలెస్ కు రూ. 500 కోట్లు ఖర్చుపెట్టారు, ఎన్ జిటి మాపై మరో రూ. 200 కోట్లు ఫైన్ వేసింది. ఒక వ్యక్తి బతకడానికి రూ. 700 కోట్లు ఖర్చుపెట్టారు. వారు మాకు నీతులు చెబుతారా? మేం ముఖ్యమంత్రి కోసం ఇల్లు కట్టడం లేదు. మేం రాజధాని కట్టేది వ్యక్తుల కోసం కాదు, 5కోట్ల ఆంధ్రుల కోసం రాజధాని నిర్మిస్తున్నాం. జగన్ ఏపీకి ఒకసారి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరం. ఆయనకు ఏ విషయంపైన కనీస అవగాహన లేదు. జాతీయ రహదారి, అమరావతి రహదార్లను పోల్చి ఎక్కువ ఖర్చుచేస్తున్నామని చెబుతున్నారు. 8లైన్ల రహదార్ల నిర్మాణంలో మేం ఎన్ హెచ్ఎఐ తో సమానంగానే ఖర్చుచేస్తున్నాం. అయితే 2లైన్ల రోడ్లను అమరావతిలో 8లైన్ల రోడ్లతో పోల్చి ఎక్కువ ఖర్చుచేస్తున్నామని ఎలా చెబుతారు, కనీసం కామన్ సెన్స్ ఉండాలి కదా? 2014-19 మధ్య వేసిన రోడ్లపై ఒక్క గొయ్యి కూడా పడలేదు. ముందుచూపుతో అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మించాం. ప్రపంచస్థాయి రాజధాని నిర్మించి తీరుతాం. 30లక్షలమంది వచ్చి అక్కడ నివసించినా సరిపోయే విధంగా రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజిలు నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో మెట్రో పెట్టడానికి కూడా అవకాశం ఉండేవిధంగా ప్రణాళికలు రూపొందించి రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇప్పుడున్న వైసీపీ నేతలే 5వేల ఎకరాల ఎయిర్ పోర్టు అవసరమా అని ప్రశ్నించారు. ఇప్పుడు హైదరాబాద్ ఎయిర్ పోర్టు చూడండి. ఇదే విజనరీకి, ప్రిజనరీకి మధ్యన ఉన్న వ్యత్యాసం. 5కోట్ల ఆంధ్రులు ఈ విషయాన్ని గమనించాలి.

**అమరావతి తొలిదశ పనులు ఎప్పుడు పూర్తిచేయబోతున్నారు?**

రెండేళ్లలో పూర్తిచేస్తాం. పోలవరం కూడా ముఖ్యమంత్రి చెప్పిన విధంగా నిర్ణీత సమయంలోపే పూర్తవుతుంది. ఆ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలకు ప్రధాని నరేంద్రమోదీని పిలుస్తాం. ఏం పేరు పెట్టాలన్నది ముఖ్యమంత్రిగారు నిర్ణయిస్తారు.

## ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ. 223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు సీఎంకు చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది. ఇక ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటిరీయల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా సీఎం ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ. 614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటిరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)


పోలవరం ప్రాజెక్టు ఎంత ముఖ్యమో నిర్వాసితులు అంతే ముఖ్యమన్న నిమ్మల పునరావాస కాలనీల నిర్మాణాన్ని సైతం వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.
పోలవరం ఫ్రటజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని మంత్రి నిమ్మల తెలిపారు. గత ప్రభుత్వం నిర్వాకంతో డయాఫ్రం వాల్ దెబ్బతిని, రూ. 440 కోట్ల మేర ప్రజాధనం వృథా అయ్యిందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నిపుణుల సూచనలతో రూ. 900 కోట్లతో మరో డయాఫ్రం వాల్ నిర్మించిందని అలానే గత ఏడాది జనవరి 18న ఈ పనులు ప్రారంభించారని వెల్లడించారు. రికార్డు స్థాయిలో 440 రోజుల్లో 1,372 మీటర్ల పొడవైన కొత్త డయాఫ్రం వాల్ నిర్మించిందని కొనియాడారు. ఈ పనులు పూర్తి కావడంతో మంత్రి నిమ్మల రామానాయుడు ఇంజినీర్లను సన్మానించి ప్రాజెక్టు వద్ద స్వీట్లు పంచారు.
పోలవరం ప్రాజెక్టును సందర్శించిన గవర్నర్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కుటుంబ సమేతంగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. కాకినాడ నుంచి హెలికాప్టర్ ద్వారా ప్రాజెక్టు ప్రాంతానికి వచ్చారు. గవర్నర్ ముందుగా ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు హిల్ వ్యూ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకున్నారు. గవర్నర్?కు మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టు హిల్ వ్యూ నుంచి ప్రాజెక్టును గవర్నర్ పరిశీలించారు. హిల్ వ్యూ వద్ద ప్రాజెక్టు ఈఎన్సీ నరసింహమూర్తి మ్యాప్ ద్వారా ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును గవర్నర్‌కు వివరించారు.

## ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు పై విచారణకు రాష్ట్రపతి కార్యాలయం ఆదేశాలు..!



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి కె. రఘురామ కృష్ణ రాజు (ఆర్ఆర్ఆర్) పై రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ టీవీ చర్చల్లో పాల్గొంటున్నారని ఆరోపిస్తూ వచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. విజయనంద్‌కు లేఖ పంపి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ పరిణామం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది.
జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ జనరల్ సెక్రటరీ పి. సురేష్ కుమార్ ఈ ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు రాజకీయ కార్యకలాపాలు, టీవీ డిబేట్లు, వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన ఆరోపించారు. మొదటి ఫిర్యాదుకు స్పందన రాకపోవడంతో సురేష్ కుమార్ మరోసారి రాష్ట్రపతి కార్యాలయాన్ని ఆశ్రయించగా, ఈసారి అధికారులు స్పందించి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రపతి కార్యాలయం లేఖలో "పిటిషనర్ ఫిర్యాదు మేరకు విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి" అని స్పష్టంగా ఆదేశించింది. ముఖ్య కార్యదర్శి విచారణ నివేదికను రాష్ట్రపతి కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుంది.
రఘురామ కృష్ణ రాజు 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఉండి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది, శాసనసభ ఉపస్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వైఎస్ఆర్‌సీపీ, బీజేపీ, టీడీపీల మధ్య పార్టీలు మారిన చరిత్ర ఉన్న ఆయన సూటిగా వ్యాఖ్యలు చేయటంలో, టీవీ చర్చల్లో యాక్టివ్‌గా పాల్గొనడానికి ప్రసిద్ధి చెందారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ పదవి నిష్పాక్షికతను కాపాడాలనే డిమాండ్‌లు ముందుకు వచ్చాయి.
జై భీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ "స్పీకర్ లేదా ఉపస్పీకర్ పదవి స్వీకరించిన వ్యక్తి పార్టీ రాజకీయాలకు అతీతంగా ఉండాలి. కానీ రఘురామ కృష్ణరాజు టీవీ డిబేట్లో పాల్గొనడం రాజ్యాంగ సంప్రదాయాల ఉల్లంఘన" అని విమర్శించారు. రాజ్యాంగ కర్తవ్యాలు నిర్వర్తిస్తున్న వారు రాజకీయ ప్రచారం, వ్యాఖ్యలు చేయకూడదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. మా ఫిర్యాదు ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడటం కోసమే అని తెలిపారు. అలాగే కోర్టును ఆశ్రయించి తగిన చర్యలు తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది.
ఈ పరిణామం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. రాజ్యాంగ పదవులు నిర్వర్తిస్తున్న నాయకులు రాజకీయ గొడవలు, వ్యాఖ్యలు చేయడం సరైనదా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఉపస్పీకర్ పదవి నిష్పాక్షికత, న్యాయబద్ధతను కాపాడాలనే డిమాండ్‌లు పెరుగుతున్నాయి.
విచారణ ఫలితం ఏమవుతుంది, రఘురామ కృష్ణ రాజు పై ఏ చర్యలు తీసుకోబడతాయి అనేది రాబోయే రోజుల్లో తెలియనుంది.


## తక్కువ సమయంలోనే డయాఫ్రం వాల్ నిర్మాణం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో నేడు మరో కీలక ఘట్టం పూర్తయ్యింది. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1372 మీటర్ల పొడవైన 'డయాఫ్రం వాల్' నిర్మాణాన్ని తక్కువ సమయంలో పూర్తి చేసిన ఇరిగేషన్ శాఖ అధికారులకు, ఇంజనీర్లకు అభినందనలు. దీనికి సహకరించిన కేంద్ర సంస్థలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ధన్యవాదాలు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డీ-వాల్ దెబ్బతినడంతో అదనంగా రూ. 1000 కోట్లు వెచ్చించి నిర్మించాం. డయాఫ్రమ్ వాల్ పూర్తి కావటంతో ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (జుజ=ఫీ) డ్యామ్ పనులు వేగవంతం అవుతాయి. ఇప్పటికే ప్రకటించినట్లు అన్ని పనులు పూర్తి చేసి 2027 పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం.

# అమరావతికి పార్లమెంట్ చట్టం...తిరుగులేని శాసనం

(మొదటి పేజీ తరువాయి)



ప్రజావేదిక విధ్వంసంతో ప్రారంభమైన చీకటి రోజులు ముగిశాయి."అని ముఖ్యమంత్రి అన్నారు.
**తెలుగు జాతి గౌరవం అమరావతి** : "అమరావతికి అపజయం లేదు... అన్ స్టాపబుల్. ప్రజా రాజధానిని సాధించుకున్నాం. ఇది ప్రజా విజయం. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ప్రధానికి ధన్యవాదాలు. హోం మంత్రి అమిత్ షా సహా కేంద్రం, దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు ఈ బిల్లుకు సహకరించాయి. పవిత్రమైన మట్టి-నీటిని రాజధాని శంకుస్థాపన చేసిన రోజున ప్రధాని తెచ్చారు. పార్లమెంట్ వద్ద ఉన్న పవిత్ర మట్టిని... పవిత్ర యమునా నది జలాలతో పునీతమైన పుణ్యభూమి ఇది. దేశం మొత్తం అమరావతికి అండగా ఉంటుందని నాడే ప్రధాని మోదీ చెప్పారు. ఆదర్శ రాజధాని తెలుగు జాతి గుండె, జాతి గౌరవం అమరావతి. ఓ ప్రాజెక్టుకు రెండు సార్లు ప్రధాని రావడం అమరావతి పనుల విషయంలోనే జరిగింది. అమరావతి నిర్మాణాలు పూర్తి అయ్యాక మరోమారు ప్రధాని ప్రారంభోత్సవాలకు వస్తారు. ప్రపంచంలోని ప్రతీ అభివృద్ధి మోడల్ అమరావతికి తెస్తాను. అమరావతికి శాశ్వతత్వం తెచ్చినందుకు ఇవాళ నాకు చాలా సంతోషంగా ఉంది. పార్లమెంటులో చేసిన చట్టాన్ని ఎవరూ మార్చలేరు. ఇప్పటి వరకు రాష్ట్రానికి అడ్రస్ లేదు..ఇప్పుడు మనకు ఓ అడ్రస్ వచ్చింది. వివిధ ప్రముఖ దేవాలయాల్లో పూజలు నిర్వహించి.. నాడు శంకుస్థాపన చేశాం. ప్రధాని మోదీ తెచ్చిన పవిత్ర మట్టి-నీటితో పునీతమైన ఈ భూమిపై ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తాం. రాష్ట్రంలో ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా ప్రజలకు హామీ ఇస్తున్నా."అని ముఖ్యమంత్రి ప్రకటించారు.
**అమరావతిని చంపాలనుకున్న పార్టీ పీడ విరగడవ్వాలి** : "ఒక్క వైసీపీ మినహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి ఇవాళ అండగా నిలబడ్డాయి. అమరావతిని స్మశానం అన్నారు కానీ ఇవాళ పార్లమెంటులో అమరావతికి తిరుగులేని శాసనం చేసుకున్నాం. రాజధానితో మూడు ముక్కలాట ఆడారు... అడ్రస్ లేకుండా పోయారు. అమరావతి విషయంలో ఇంత జరిగినా వైసీపీకి మాత్రం బుద్ధి రాలేదు. వారి పిచ్చి ఇంకా ముదిరింది. అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై తీర్మానం పెడితే ఆ పార్టీ అసెంబ్లీకి కూడా హాజరు కాలేదు. పార్లమెంటులో చట్టం చేస్తుంటే.. వాకౌట్ చేసింది. వాకౌట్ చేసిన ఆ పార్టీని ప్రజలు బ్లాక్ అవుట్ చేయాలి. అమరావతిని చంపాలనుకున్న వైసీపీ బాగుపడదు. ఇంతటి నీతిమాలిన రాజకీయం నా చరిత్రలో చూడలేదు. వైసీపీని అంతా మరిచిపోవాలి, రాష్ట్రానికి ఆ పార్టీ పీడ విరగడవ్వాలి. మావిగన్ అంటూ ఓ కొత్త ప్రతిపాదన చేశారు. డిక్షనరిలో చూశాను నాకు అర్థం కాలేదు. వైసీపీవి అన్నీ బుద్ధి లేని వ్యాఖ్యలు..దుర్మార్గపు ఆలోచనలే."అని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.
**శంకుస్థాపన స్థలంలో దీప హారతి- ప్రత్యేక పూజలు** :
అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి నేతలతో కలిసి శంకుస్థాపన శిలాఫలకాన్ని పరిశీలించారు. పవిత్ర మట్టి, జలాలు ఉన్న వేదిక వద్ద వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజధాని భూమికి సాష్టాంగ ప్రణామం చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో దీప హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పి. నారాయణ, అచ్చెన్నాయుడు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, అమరావతి రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ రాజధాని గురించి ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. రాజధాని కోసం ఉద్యమించిన రైతులు, మహిళలకు సరైన న్యాయం దక్కింది. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది, మరో రాష్ట్రానికి లేదు' అని వెల్లడించారు.
హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలి : అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి పాల్గొన్నారు. "బిల్లు ప్రవేశపెట్టడం రైతుల విజయం. రాజధాని ఉద్యమ సమయంలో రైతులను, మహిళలను తీవ్రంగా హింసించారు. రాజధానిపై 12 ఏళ్లుగా అస్పష్టతగా ఉంది. అస్పష్టత వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. గత సీఎం(వైఎస్ జగన్) మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. దుగరాజపట్నం పోర్టు ఇస్తామని హామీ నెరవేర్చలేదు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే. ఇప్పటివరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలి. 12 ఏళ్ల తర్వాత ఆస్తుల పంపకం పూర్తికాలేదు" అని రేణుకా చౌదరి తెలిపారు. తెలుగుజాతికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా : అనంతరం బీజేపీ రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ, "రాజధాని కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. భవ్య రాజధాని సాకారం కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం తీసుకున్నారు. వికసిత్ భారత్ సాకారం కోసం వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యకం. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరం ఉంది. రాజధాని కోసం సుదీర్ఘంగా పోరాడిన మహిళలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు.
అమరావతికి చట్టబద్ధత బిల్లుకు మద్దతిస్తున్నాం : అనంతరం బీజేపీ రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, " అమరావతికి చట్టబద్ధత బిల్లుకు మద్దతిస్తున్నాం. అమరావతిని రాజధాని చేయడం ప్రజలందరికీ ఆమోదయోగ్యం. అమరావతికి పూర్తిగా మద్దతు ఇస్తున్నా. అమరావతి ఏపీకి మధ్యలో ఉంటుంది. పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుంది. అమరావతి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషిచేస్తున్నారు. పవిత్ర భూమిలో రాజధాని తప్పనిసరిగా వర్ధిల్లుతుంది. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలి' అని అన్నారు. రాజ్యసభ నుంచి వైఎస్సార్సీపీ వాకౌట్ : అనంతరం వైఎస్సార్సీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ," రాజధాని రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తుందనే దానిపై బిల్లులో స్పష్టత లేదు. రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పాలి. ఏపీకి ప్రత్యేక హోదా విషయంపై బిల్లులో ప్రస్తావన లేదు. ప్రత్యేక హోదాపై ప్రస్తుత అధికార పార్టీ ఎప్పుడో మరచిపోయింది. ప్రత్యేక హోదాపై వైఎస్సార్సీపీ మాత్రం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంది. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. వేలకువేల ఎకరాలు తీసుకున్నారు, ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. ఇప్పటివరకు ఒక్క ప్లాటు కూడా అమరావతి రైతులకు ఇవ్వలేదు. ఈ భూములు చాలదన్నట్లు కొత్తగా మళ్లీ భూముల సేకరణ మొదలుపెట్టారు. అమరావతి రైతుల వేదన చంద్రబాబుకు పట్టట్లేదు. రెండేళ్లలోనే సుమారు రూ. 3 లక్షల కోట్లు అప్పు చేశారు." అని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలోనే వైఎస్సార్సీపీ వాకౌట్ చేసింది.
అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీల ఎంపీలు మాట్లాడారు. చర్చలో 17 మంది సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్సీపీ మినహా అమరావతికి 10 పార్టీలు మద్దతు తెలిపాయి. ఎలాంటి సవరణలు లేకుండా ఉభయ సభల్లో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిగా అమరావతి ఏర్పాటైన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో అమరావతి అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుందని ఆకాంక్షించారు. బిల్లుపై అన్ని పార్టీల సభ్యల ప్రసంగాలపై జవాబిచ్చిన కేంద్రమంత్రి నిత్యానందరాయ్ ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రూపంలో కొత్త రాజధాని వచ్చిందని అభినందనలు తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరడంతో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా అమరావతి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బిల్లుకు సభ్యులందరి మద్దతు ఉంది కనుక పాస్ చేయాలని రాజ్యసభ ఛైర్మన్‌ను కోరారు. అనంతరం సభ్యులందరి సమ్మతితో అమరావతికి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాక్రిష్ణన్ ఆమోదముద్ర వేశారు. సభ్యుల జై అమరావతి, జై భారత్ నినాదాలు సభలో మార్మోగాయి. వేంకటేశ్వరుడి ఆశీస్సులతో అమరావతి, ఆంధ్రప్రదేశ్ ప్రజలు వర్ధిల్లాలని ఉపరాష్ట్రపతి రాధాక్రిష్ణన్ ప్రార్థించారు.
అమరావతికి చట్టబద్ధత బిల్లుపై చర్చను మంత్రి నారా లోకేశ్?, లోక్‌సభ ఎంపీలు, ముఖ్య నేతలతో కలిసి గ్యాలరీలో కూర్చొని ఆసక్తిగా వీక్షించారు. చర్చ ముగిసి బిల్లు ఆమోదం పొందగానే అంతా లేచి కరతాళధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

## అమరావతికి పార్లమెంట్ అభయం.. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయం



- **అమరావతికి పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం**
- **ఐదేళ్ల చీకటి పాలన అంతమైంది - ఇక రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభం..ఇది చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించిన మంత్రి దుర్గేష్**
- **ప్రధాని మోదీ, అమిత్ షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు కృతజ్ఞతల**
- **జగన్ 'మూడు ముక్కలాట'కు పార్లమెంట్ సాక్షిగా చరమగీతం...ఇది అమరావతి రైతులు, మహిళల పోరాటానికి దక్కిన గౌరవం**

**న్యూఢిల్లీ/అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఉభయ సభల్లో చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి దుర్గేష్ అమరావతి బిల్లు రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన అనంతరం ఒక కీలక ప్రకటన విడుదల చేశారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా జగన్ మోహన్ రెడ్డి 'మూడు రాజధానుల' పేరుతో రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. "జగన్ విధ్వంసం చేస్తే.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. రాజధానిపై జగన్ వక్రబుద్ధి మారలేదు అనడానికి నిన్న ఆయన తెరపైకి తెచ్చిన 'మావిగన్' ప్రతిపాదనే నిదర్శనం. జగన్ చంచల మనస్తత్వాన్ని చూసి దేశమంతా నవ్వుకుంటోంది" అని ఎద్దేవా చేశారు. అమరావతిని వైసీపీ వ్యతిరేకిస్తున్నా, దేశంలోని 40కి పైగా రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు పలకడం అమరావతి ప్రాశస్త్యాన్ని చాటిచెబుతోందని అన్నారు. అమరావతి కోసం ఒక్క రూపాయి ఆశించకుండా భూములిచ్చి, 1600 రోజులుగా పట్టుదలతో ఉద్యమం చేసిన రైతులు, మహిళల పోరాట ఫలితమే నేటి ఈ విజయం అని మంత్రి దుర్గేష్ కొనియాడారు. విభజన చట్టంలోని సెక్షన్ 5(2)కు సవరణ ద్వారా అమరావతికి శాశ్వత చట్టబద్ధత లభించడం రాష్ట్ర పునర్నిర్మాణానికి నాంది అని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక బిల్లును ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, సహాయ మంత్రి నిత్యానందరాయ్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు, ఎంపీలకు మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలుపెరుగని కృషి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్థిరమైన నిబద్ధత వల్లే అమరావతికి ఈ స్థాయి గౌరవం దక్కిందని స్పష్టం చేశారు. రాజధానిపై సందిగ్ధత తొలగడంతో ఇకపై అంతర్జాతీయ పెట్టుబడులు వెల్లువెత్తుతాయని, పారిశ్రామికంగా, పర్యాటకంగా ఏపీ కొత్త పుంతలు తొక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధానికి పట్టిన గ్రహణం వీడిన ఈ ఆనంద సమయంలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకుందామన్నారు. ప్రతి ఇంట్లో, ప్రతి ఊరిలో "అమరావతికి దీపహారతులు" ఇచ్చి ఈ చారిత్రక విజయాన్ని వేడుకగా జరుపుకోవాలని కోరారు. వికసిత్ భారత్ సాకారం కావాలంటే వికసిత్ ఆంధ్రప్రదేశ్ అవసరమని, అందుకు కేంద్ర సహకారంతో విజనరీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతామని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు.

# ఆంధ్రుల హృదయాల్లో చిరస్థాయిగా ప్రధాని మోదీ





(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అందించిన తోడ్పాటు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందేందుకు కీలక పాత్ర పోషించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు.
అమరావతి చట్టబద్ధత సాధన ఒక చారిత్రాత్మక మైలురాయిగా ఆయన అభివర్ణించారు. ఎన్నో కష్టాలు, పోరాటాల తర్వాత ఈ విజయాన్ని సాధించగలిగామని, ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పట్టుదలతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ప్రజాప్రతినిధులు, ఎంపీలు చేసిన కృషిని కూడా ప్రత్యేకంగా గుర్తు చేశారు. అమరావతి కోసం రైతులు చేసిన త్యాగాలను మాధవ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2019-24 కాలంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులు మరువలేనివని చెప్పారు. దేశంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీల మద్దతు అమరావతికి లభించడం విశేషమని తెలిపారు.
అమరావతి కేవలం పరిపాలనా రాజధాని మాత్రమే కాకుండా అభివృద్ధి, పరిశ్రమలు, పర్యాటకం, సంక్షేమానికి కేంద్రంగా ఎదుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, జలాలను తీసుకువచ్చి అమరావతికి సమర్పించడం ద్వారా దేశవ్యాప్త అనుబంధాన్ని పెంచారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో రాజధాని సెలక్షన్ కమిటీలో భాగమై కేంద్రానికి నివేదికలు పంపిన విషయాన్ని ఆయన గర్వంగా గుర్తు చేసుకున్నారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
కార్యక్రమంలో బీజేపీ నేతలు పనతల సురేష్, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు. అమరావతి విజయంతో రాష్ట్ర ప్రజల ఆశలు నెరవేరినట్లు నాయకులు అభిప్రాయపడ్డారు.

# ఉద్యోగులకు రూ.7000 కోట్ల బకాయిల చెల్లింపు నిర్ణయంపై ఎన్జీజీవో హర్షం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటు ఉభయసభల్లో బిల్లు ఆమోదం పొందడం ప్రతి ఆంధ్రుడు గర్వించదగిన ఘట్టమని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీజీవో హోమ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
ఈ బిల్లుకు ఆమోదం లభించేందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రివర్గ సభ్యులు, అమరావతికి మద్దతు తెలిపిన జాతీయ స్థాయి నేతలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి శాశ్వత రాజధానిగా కొనసాగేందుకు చట్టబద్ధత రావడం అభివృద్ధి దిశగా కీలక మైలురాయిగా అభివర్ణించారు.
గత ప్రభుత్వ కాలంలో పేరుకుపోయిన ఉద్యోగుల బకాయిలను రూ. 7,000 కోట్లకు పైగా చెల్లించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని తెలిపారు. దశలవారీగా చెల్లింపులు జరుగుతున్నప్పటికీ మరింత వేగం అవసరమని ఉద్యోగులు ఆశిస్తున్నారని చెప్పారు.
ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆమోదంతో రూ. 7,059 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకోవడం ఉద్యోగులకు భారీ ఊరట కలిగించిందని తెలిపారు. ఈ నిధులతో గతంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు క్లియర్ కానున్నాయని వివరించారు.




విడుదల కానున్న నిధుల్లో జిపిఎఫ్‌కు రూ. 1,847.83 కోట్లు, గ్రాట్యూటీకి రూ. 3,411.03 కోట్లు, లీవ్ ఎన్కాష్మెంట్‌కు రూ. 1,800 కోట్లు, పోలీసు సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపులకు రూ. 223.47 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే జిపిఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, జిఎల్ఐ కింద కొన్ని చెల్లింపులు పూర్తయ్యాయని పేర్కొన్నారు.
ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధను అభినందిస్తూ, పెండింగ్ బకాయిల చెల్లింపులో తీసుకున్న నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ నిరంతర పోరాటం, ప్రభుత్వ సానుకూల వైఖరి కలిసి ఉద్యోగులకు మేలు చేసే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయని తెలిపారు.
ఈ సందర్భంగా జేపీసీ, యుటిఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు ముఖ్యమంత్రిని కలిసి అమరావతి బిల్లుకు ఆమోదం లభించినందుకు అభినందనలు తెలిపారు. రూ. 7,000 కోట్ల విడుదల నిర్ణయానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పిఆర్సి కమిటీ చైర్మన్ నియామకం, సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపులపై కూడా దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.



## ఏడుపదుల వయసులో డాక్టరేట్ అందుకున్న శంభుప్రసాద్

**విజయవాడ, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

ఏడుపదుల వయసులో సాయుధ దళాల విశ్రాంత అధికారి శంభుప్రసాద్ కృష్ణా విశ్వవిద్యాలయం (మచిలీపట్నం) నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. విజయవాడలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి. జంపాల పర్యవేక్షణలో "భారతీయ సంప్రప్రదాయ జ్ఞానం ఆధారంగా వ్యాపారసంస్థల రూపకల్పన" అనే అరుదైన అంశంపై తన విశేష అనుభవాన్ని జోడిస్తూ సమర్పించిన సిద్ధాంతగ్రంథానికి విశ్వవిద్యాలయం పీహెచ్డీ పట్టాను ప్రకటించింది. చాణక్యుని ప్రపంచానికి అందించిన భారతదేశం, భారతీయ జ్ఞాన వ్యవస్థలను కార్పొరేట్ రంగానికి అనుసంధానం చేయడంపై శంభుప్రసాద్ చేసిన అధ్యయనం విశిష్టమైందిగా పేర్కొంటూ ఆచార్య రాజేశ్ సి. జంపాలతో పాటు పలువురు శంభు ప్రసాద్ ను అభినందించారు. ఈ ముదిమి వయసులో పట్టుదలే ఊపిరిగా, యువతకు ఆదర్శంగా ఉత్తమ పరిశోధక విద్యార్థిగా శంభు ప్రసాద్ నిలిచారని కొనియాడారు. ఈ పరిశోధన గ్రంథం ఇప్పటివరకు 25 దేశాల నుండి 2 వేల 281 వీక్షణలు, 406 డౌన్‌లోడ్‌లతో ఉత్తమ పరిశోధనగా నిలిచిందన్నారు. శంభుప్రసాద్ పరిశోధనపత్రాలు ఎస్.ఎస్.ఆర్.ఎన్., రీసెర్చ్ గేట్ తదితర చోట్ల ప్రచురితమయ్యాయి. విద్యకు వయసుతో పనిలేదని నిరూపించిన డాక్టర్ శంభుప్రసాద్ ను ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. మేకా రమేశ్, డైరెక్టర్ వేమూరి బాబూరావు ప్రత్యేకంగా అభినందించారు.

## ఏకా - ది వన్ చిత్ర ప్రదర్శన అదరహో..

### ప్రతి స్వరూపం విశిష్ట స్త్రీ శక్తికి ప్రతిరూపం

### ప్రదర్శనను తిలకించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

సాంస్కృతిక వారసత్వానికి ప్రోత్సాహమిస్తూ ఏకా- ది వన్ పేరుతో ఏర్పాటుచేసిన జాతీయస్థాయి సంచార చిత్ర ప్రదర్శన అద్భుతమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రశంసించారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన ఏకా – ది వన్ జాతీయ స్థాయి సంచార చిత్ర ప్రదర్శనను కలెక్టర్ లక్ష్మీశ బుధవారం రాష్ట్ర సాంస్కృతిక సృజనాత్మక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటితో కలిసి తిలకించారు. ప్రముఖ కళాకారిణి డాక్టర్ బీనా ఉన్నికృష్ణన్ రూపొందించిన 64 యోగిని చిత్రాలను ఆసక్తిగా పరిశీలించి.. వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకొని అభినందనలు తెలిపారు. దేశ ఆధ్యాత్మిక సంప్రదాయ ఔన్నత్యాన్ని నేటి తరానికి పరిచయం చేసేలా ఈ ప్రదర్శన ఉందని కొనియాడారు. ప్రాచీన ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని నేటి సామాజిక సంభాషణ లోకి తీసుకువచ్చే ఒక సమకాలీన కళాత్మక వివరణగా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఇంత మంచి ప్రదర్శనను ఏర్పాటుచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## మాంసం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



**నూజివీడు, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

నూజివీడు పట్టణంలో మాంసం విక్రయించే దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు మున్సిపల్ అధికారులు. నూజివీడు మున్సిపల్ కమిషనర్ మరియు శానిటరీ ఇన్స్పెక్టర్ జంక్షన్ రోడ్‌లోని మాంసం దుకాణాలను పరిశీలించారు. దుకాణ పరిసరాల శుభ్రతను కచ్చితంగా పాటించాలని యజమానులకు ఆదేశించారు. అంతేకాదు, రోడ్డుపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా దుకాణాలను నిర్వహించాలని కఠినంగా సూచించారు. పరిశుభ్రత నిబంధనలు ఉల్లంఘించేవారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



**జగ్గయ్యపేట, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

జగ్గయ్యపేట పట్టణంలోని 23వ వార్డు మంగలి బజార్ మరియు 1వ వార్డు యానాదుల కాలనీలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్థానిక నాయకులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నేరుగా ఇంటి వద్దకే పెన్షన్ అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు దువ్వల రామకృష్ణ, సామినేని మనోహర్, సంగెపు బుజ్జిబాబు, గొట్టె నాగరాజు, పునుగుపాటి పుల్లారావు, షేక్ ఇజాజ్, సయ్యద్ ఉమ్మర్, షేక్ షబ్బు, ఎస్కే గౌసియా, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి తెలుగువారి శాశ్వత రాజధాని దిశగా అడుగులు

- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా. జే.ఎల్. మురళీధర్



**అనంతపురం, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

"నాడు దేవతల రాజధాని, నేడు తెలుగు ప్రజల రాజధాని అమరావతి" అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మైదుకూరు నియోజకవర్గ పరిశీలకులు, అనంతపురం పట్టణ సహకార బ్యాంకు అధ్యక్షుడు డా. జే.ఎల్. మురళీధర్ తెలిపారు. తెలుగు ప్రజల రాజధానిగా అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, పార్లమెంట్ సభ్యులకు, అలాగే అమరావతి సృష్టికర్తగా పేరుపొందిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, నారా లోకేష్ కి తెలుగు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీపి కబురని, కూటమి ప్రభుత్వ విజయంగా పేర్కొన్నారు. లోక్‌సభలో ఈ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు వ్యతిరేకించడం పెద్ద తప్పు అని విమర్శించారు. రెండు వేల పద్దెనిమిది నుంచి రెండు వేల ఇరవై నాలుగు వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ముఖ్యంగా భూములు ఇచ్చిన అమరావతి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. మహిళా రైతులను సైతం బాధించిన ఘటనలు ప్రజల మనసుల్లో మిగిలిపోయాయని పేర్కొన్నారు. రాజ్యసభలో కూడా బిల్లు ఆమోదం పొందిన తరువాత అమరావతి ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా నిలుస్తుందని, ఇకపై రాజధాని పేరుతో రాజకీయాలు చేసే అవకాశం లేకుండా పోయిందని డా. జే.ఎల్. మురళీధర్ తెలిపారు.

# ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం





- శ్రీ ధరణి దుర్గమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న కోగంటి సత్యనారాయణ

**విజయవాడ, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పైపుల్ రోడ్ శాంతి నగర్‌లోని శ్రీ చంద్రమౌళీశ్వర సమేత శ్రీ ధరణి దుర్గమ్మ దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ పాల్గొన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం ఆయన రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కోగంటి సత్యనారాయణను పూర్ణకుంభంతో స్వాగతించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను, ఆయన మిత్రబృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సురేష్, ముద్దాడ సూరిబాబు, బొంగు వాసు, దేశెట్టి బాబురావు, యరబర్ల శ్రీనివాస్, మిర్యాల రామకృష్ణ, దేవరపల్లి రాజేష్ తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## 'ఎవ్రీడే యమ్మీ విత్ హెరిటేజ్ పనీర్'

# విజేతగా హైదరాబాద్ హోమ్ షెఫ్





- ఈటీవీ అభిరుచి వేదికగా మెగా కుకింగ్ కాంటెస్ట్

**విజయవాడ, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

దక్షిణాదిలో అత్యంత ప్రజాదరణ పొందిన 'ఎవ్రీడే యమ్మీ విత్ హెరిటేజ్ పనీర్' ప్రచార కార్యక్రమం గ్రాండ్ ఫినాలే హైదరాబాద్‌లో ఘనంగా ముగిసింది. ఆరు ప్రధాన నగరాల నుంచి మూడు వేల మందికి పైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వెయ్యికి పైగా వినూత్న రెసిపీలతో సాగిన ఈ పోటీలో హైదరాబాద్‌కు చెందిన దివ్య సాహితి అంకిరెడ్డి 'పనీర్ పాయసం' వంటకంతో గ్రాండ్ విజేతగా నిలిచారు. ?తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి ఈ పోటీకి అద్భుతమైన స్పందన లభించింది. యూట్యూబ్ ఛానల్ నిర్వాహకురాలు ఎంఎస్ భార్గవి హోస్ట్‌గా వ్యవహరించారు. షెఫ్ రాజు సమక్షంలో జరిగిన ఈ వేడుక ఈటీవీ అభిరుచి ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాది మంది వీక్షకులను అలరించింది. అక్టోబర్ 2025లో ప్రారంభమైంది. ఆరు ప్రధాన నగరాల్లో హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, బెంగళూరులో కొనసాగింది. ఈ సందర్భంగా హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీదీప్ కేశవన్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని హోమ్ షెఫ్స్‌కు 'ఎవ్రీడే యమ్మీ విత్ హెరిటేజ్ పనీర్' ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. ఈ గ్రాండ్ ఫినాలేను ఈటీవీ అభిరుచి భాగస్వామ్యంతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఈ ప్రచారానికి సరికొత్త రూపాన్ని ఇచ్చిందన్నారు. ఇది కేవలం ఒక వంటల పోటీ మాత్రమే కాదని, దక్షిణ భారత హోమ్ కుకింగ్‌ను పెద్ద ఎత్తున జరుపుకున్న ఒక వేడుక అన్నారు. హెరిటేజ్ ఫుడ్స్, ఈటీవీ అభిరుచి మధ్య కుదిరిన భాగస్వామ్యం వల్ల ఈ గ్రాండ్ ఫినాలే దక్షిణాదిలో అత్యధిక వీక్షణలు కలిగిన టెలివిజన్ నెట్‌వర్క్‌ల ద్వారా ప్రజలకు చేరువైంది. ప్రముఖ ఫుడ్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఎంఎస్ భార్గవి తనదైన శైలిలో ఈ ఈవెంట్‌ను నడిపించారు. స్టూడియోలో ప్రేక్షకులతో పాటు టీవీ వీక్షకులు కూడా ఒకేసారి వంట చేసేలా ఆమె నిర్వహించిన మాస్టర్‌క్లాస్ అందరినీ అలరించింది. టీవీతో పాటు తన యూట్యూబ్ ఛానల్‌లో కూడా లైవ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో వర్చువల్‌గా వేలాది మంది అభిమానులు ఈ విజయోత్సవ క్షణాలను వీక్షించారు. దక్షిణ భారతదేశం నలుమూలల నుంచి వచ్చిన హోమ్ కుక్స్, హెరిటేజ్ పనీర్‌ను సంప్రదాయబద్ధంగానే కాకుండా ఊహించని సరికొత్త రీతుల్లో ఉపయోగిస్తూ ఎంతో సృజనాత్మకతతో చేశారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ ప్రైజ్ విజేతతో పాటు ప్రచారంలో పాల్గొన్న ప్రతి నగరం నుంచి ఎంపికైన టాప్ ఫైనలిస్టులను సత్కరించారు. హోమ్ షెఫ్స్ అందరికీ గిఫ్ట్ హ్యాంపర్లు అందజేశారు.

# రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి
- ఆగిరిపల్లి మండలంలో రూ.5.71కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఆగిరిపల్లి, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి మరియు తోటపల్లి గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి నిర్వహించారు. ఆగిరిపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, తోటపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, అంగన్వాడీ సెంటర్‌ను ప్రారంభించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి రూ.5 కోట్లు 71 లక్షలతో మద్దతు ఇవ్వబడింది.మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రధాన ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం వేగవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన పథకాలను ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టి వేగవంతం చేస్తోందని, ఒక్కొక్క హామీని క్రమంగా అమలు చేస్తున్నామని వివరించారు.ముగ్గురు వయసులో పెంచిన పింఛన్లు, ల్యాండు టైటిలింగు రద్దు, భుజాలు భద్రత కల్పించడం, అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రతి ఒక్కరు మూడు పూటల భోజనం కేవలం 5 రూపాయలకే అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాల వివరాలను మంత్రి హైలైట్ చేశారు. అదనంగా, రైతులకు ఒక హెక్టరుకు ఇన్పుట్ సబ్సిడీ రూ.25 వేలుగా పెంచడం, 16,434 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం వంటి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పథకాలను ఆయన గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకు లు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌ను
# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ, స్టేషన్ రికార్డులను పరిశీలించారు.**

**ఇన్వెస్టిగేషన్‌లో వేగం పెంచి బాధితులకు సత్వర న్యాయం అందించాలి.**

**నేరాలు, ఆన్‌లైన్ మోసాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.**




సంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. వివిధ నేరాలలో సీజ్ చేసిన వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. స్టేషన్ రికార్డులు జనరల్ డైరీ, హిస్టరీ షీట్లు, పిటిషన్ రిజిస్టర్‌లను తనిఖీ చేస్తూ.. అన్ని రికార్డులు తాజా సమాచారం తో అప్డేట్‌గా ఉంచాలని అన్నారు. పెండింగ్ మరియు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఎస్.హెచ్. ఓ కు సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం "అరైవ్ అలైవ్" వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రోడ్డు నిర్మాణంలో లోపాలను, అధిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలనూ గుర్తించి, ఎన్ హెచ్ ఎ ఐ తో చర్చించి, మరమత్తులు చేయించాలని అన్నారు. తరచూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, నాకాబంది వంటి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత సమస్యలేమైనా ఉన్నట్లయితే సంబంధిత అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## అమ్మాయిపల్లి గ్రామంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

**ప్రజలతో ముఖాముఖి అధికారులకు దిశానిర్దేశం**

**వనపర్తి జిల్లా**



చిన్నంబావి మండలం ఏప్రిల్ 02 : కొల్లాపూర్ నియోజకవర్గం, చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయిపల్లి గ్రామాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు వారితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్యటించారు. గ్రామానికి వచ్చిన మంత్రికి గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ ఆరేపల్లి మాధవి మాధవరెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేయడం జరిగింది. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై స్థానిక అధికారులు, ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ప్రజలు తమ గ్రామ సమస్యలను గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ ఆరేపల్లి మాధవి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్క సమస్య నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం, స్కూల్ గ్రౌండ్, గ్రామ లైబ్రరీ బిల్డింగ్, బీసీల ఇండ్ల స్థలాల పెండింగ్ విషయం, దేవాలయం దగ్గర ఉన్న బావి, ఐమాక్స్ లైట్ల, వీపనగండ్ల రోడ్డుకు సైడ్ కాలువల గురించి, ఈ సమస్యలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సహకరించి సాంక్షన్ ఇవ్వాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని సూచించారు. సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్, ఉప సర్పంచ్ ఆరేపల్లి మాధవి మాధవరెడ్డి, గ్రామ అధ్యక్షులు మోహన్ రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## వయోవృద్ధుల ఆశ్రమం నిర్మాణ పనులను
## పరిశీలించినజిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి



సంగారెడ్డి ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : సంగారెడ్డి పట్టణం లోని బుధవారం ఉదయం జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి వయోవృద్ధుల ఆశ్రమం నిర్మాణ పనులను పరిశీలించారు అదేవిధంగా బాల రక్షాభవన్ ,సఖి కేంద్రం, పిల్లల సంక్షేమ కేంద్రం, ప్రానామ్ డే కేర్ సెంటర్, శిశు గృహ, శ్రావణ గ్రంథాలయం సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినారు అధికారులతో మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ పై అవగాహన పోస్టర్ ను
## ఆవిష్కరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని తన నివాసంలో ప్రముఖ హీరో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ (ఏ ఏ ఎఫ్ ఏ) ఆధ్వర్యంలో హెచ్ పి వి వ్యాక్సిన్ పై సోషల్ మీడియా, వివిధ ప్రచార మాధ్యమాల ద్వారాఅవగాహనకార్యక్రమాలను నిర్వహించటానికి రూపొందించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రముఖ నటుడు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ చేస్తున్నసామాజికకార్యక్రమాలను అభినందించారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లకు కారణమయ్యే హ్యూమన్ పాపిల్లోమా వైరస్ రకాల నుండి రక్షణ కల్పించే సురక్షితమైన, అత్యంత ప్రభావవంతమైన, దీర్ఘకాలిక రక్షణ కోసం ప్రభుత్వం హెచ్ పి వి వ్యాక్సిన్ ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ వ్యాక్సిన్ ను బాల బాలికలు తప్పనిసరిగా వేసుకోవాలని మంత్రి సూచించారు. హెచ్ పి వి వ్యాక్సిన్ ను రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోఉంచామన్నారు. ఈ వ్యాక్సిన్ ను 9 నుండి 14 సంవత్సరాల వయసు గల బాల బాలికలు తప్పనిసరిగా వేసుకునేలావారితల్లిదండ్రులు ప్రోత్సహించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు.

# ఆర్కేపురం డివిజన్ లో బీజేపీకి ఎదురు దెబ్బ

**కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన కమలం నేతలు**

**జీహెచ్ఎంసి లో పట్టుబిగిస్తున్న హస్తం నేతలు**

**మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.**



(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం ఏప్రిల్ 02 : మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీజేపీ అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్, మాజీ వార్డు మెంబర్ రమేష్ గౌడ్, డివిజన్ జనరల్ సెక్రటరీ సుదర్శన్, ఎన్టీఆర్ నగర్ ఫేస్ 2 అధ్యక్షులు రవి సహా పలువురు కాంగ్రెస్ లో చేరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు కేఎల్ఆర్ పాత వారిని గౌరవిస్తూ.... కొత్తగా పార్టీలో చేరిన వారికీ సముచిత స్థానం కల్పిస్తామని కిచ్చెన్నగారు హామీ ఇచ్చారు.వచ్చే జీహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే అఖండ విజయం సాధిస్తారని లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.బీజేపీకి సరైన నాయకత్వం లేకపోవటం, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కొత్తగా పార్టీలో చేరిన నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పున్నా గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## "అస్త్రం ది రియల్ జిమ్ " ను ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి




(జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం ఏప్రిల్ 02 : మహేశ్వరం మండల కేంద్రంలోని రిలయన్స్ స్మార్ట్ పాయింట్ బిల్డింగ్ 2వ అంతస్తులో సీతారాం నాయక్ నూతనంగా ఏర్పరు చేసిన "అస్త్రం ది రియల్ జిమ్ " ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి. సీతారాం నాయక్ కి శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# గుర్తు తెలియని వాహనం ఢీ ఒకరు మృతి

**నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం**



ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : సిరికొండ మండలకేంద్రంలో గల లతీఫ్ టీ పాయింట్‌లో పనిచేసే మహమ్మద్ రహమాన్ (34) హొన్నాజిపేట్ గ్రామవాసి మార్చి 31వ తేదీ మంగళవారం రాత్రి తన పని ముగించుకొని రాత్రి సమయంలో తన బైక్‌పై ఇంటికి వెళు తుండగా అతను గడ్కోల్ గ్రామ శివారులోకి చేరుకోగనే గుర్తు తెలియని వాహనం అతని బైక్‌ను ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో మహమ్మద్ రహమాన్ గారికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనపై మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నమని ఎస్ఐ జె. రామకృష్ణ తెలిపారు.

## ఆర్కేపురం ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలనీ
## మున్సిపల్ కమిషనర్ వినయ కృష్ణ రెడ్డి కి వినతి

**: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



నేరెడ్ మెట్ , ఏప్రిల్ 02 : మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్కేపురం ఫ్లైఓవర్ అలైన్‌మెంట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.అలాగే ఏఓసి ప్రాంతంలో అదనపు రోడ్ల నిర్మాణ పనులను ఆలస్యం లేకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేసి ఉపశమనం కల్పించాలని స్పష్టం చేశారు.దీనిపై స్పందించిన అధికారులు అవసరమైన చర్యలు తీసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకుడు వెంకన్న, సంపత్ యాదవ్, బాబు తదితరులు పాల్గొన్నారు

## ఆరుగాలం పండించిన మొక్కజొన్న పంటకు
## గిట్టుబాటు ధర లేక కన్నీరు మున్నీరు అవుతున్న రైతులు



ఖమ్మం, చింతకాని, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండల పరిధిలో ఖమ్మం జిల్లాలోని అత్యధికమైన సాగు పంటగా మొక్కజొన్న పంటను రైతులు పండిస్తుంటారు ఈ మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అయోమయంలో వద్దారు. గత ప్రభుత్వం హయాంలో మొక్కజొన్న పంటకు గిట్టుబాటు నిర్ణయించి రైతుల దగ్గర నుండి నేరుగా ప్రభుత్వమే మార్క్ ఫెడ్ సిస్టం అమలు చేసి రైతుల వద్దనుండి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడం జరిగింది. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తారని ఆశతో రైతులు సంతోషంతో మొక్కజొన్న పంటను పండించడం జరిగింది. పండించిన పంటకు గిట్టిబాటు ధర పెట్టకుండా దళారులు రైతుల దగ్గర పంటను వడ్డీ పావుసేరు లెక్క కొనుగోలుకు అడగడం జరుగుతుంది. పండించిన పంటకు ఈప్పటికైనా ప్రభుత్వం స్పందించి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు జిల్లా అయినటువంటి జిల్లాలో ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని జిల్లా మొక్కజొన్న పంట పండించిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పేతుళ్ల లో ఇదమ్మ విగ్రహా ప్రతిష్ట

**కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్**



ఇబ్రహీం పట్నం ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : ఇబ్రహీంపట్నం మండల్ తూలేకలాన్(పేత్తూల్ల) గ్రామంలో ఇదమ్మ విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం లో పాల్గొన్న ఇబ్రహీంపట్నం మండల్ కాంగ్రెస్ పర్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు ఈ సందర్బంగా కోడూరి రమేష్ మాట్లాడుతూ ఇదమ్మ తల్లి కృపతో గ్రామంలో ని ప్రజలు ఆయు ఆరోగ్య లతో ఉండాలి అని వర్షాలు సమృద్ధిగా కురవళి అని యువతకు ఉద్యోగా అవకాశాలు రావాలి అని గ్రామం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలి అని ఇదమ్మ తల్లిని కోరుకోవడం జరిగింది ఈ కార్యక్రమం లో దాచపెల్లి రమేష్ సత్తు శేషంక్ రెడ్డి సాయి కిషనరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కృష్ణ వెంకటేష్ బీరప్ప ప్రభు శ్రీశైలం నర్సింహా పండు కిషన్ రమేష్ కిరణ్ శ్రీశాంత్ శ్రీకాంత్ మని మహేష్ గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ కోటగట్టు రామచంద్ర స్వామి రథోత్సవం

**ఆలయ కమిటీ చైర్మన్ కాయితి వెంకట్ రెడ్డి**

**గ్రామ సర్పంచ్ తొట్ట రమేష్**



**ఉప సర్పంచ్ కాయితి శ్రీనివాస్ రెడ్డి**

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : యాచారం మండలంలోని చింతపట్ల గ్రామంలో వెలసిన శ్రీ కోటగట్టు సీతారామచంద్రస్వామి రథోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ కాయితి వెంకటరెడ్డి మాట్లాడుతూ, శ్రీకోటగట్టు సీతారామచంద్రస్వామి జాతర మహోత్సవాన్ని ముందు భవిష్యత్తులో మన చింతపట్లలోఅన్ని సౌకర్యాలతో భక్తి శ్రద్ధలతో జరుపుతామని వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి అశేష భక్త జనానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ జాతర మహోత్సవానికి సహకరించిన గ్రామస్తుల ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతూ, సీతారామచంద్రస్వామి రథోత్సవానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అన్నదాన ప్రసాదం ఇచ్చిన మహనీయులు కాయితి యాదమ్మ మోహన్ రెడ్డి దంపతులు వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం అందించే భక్తులకు ఏ లోటు లేకుండా చూసుకున్నారు అని అన్నారు. గ్రామ సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ, మన గ్రామంలో జరిగే జాతరకు భవిష్యత్తులో భక్తులు అందరు కూడా తరలివచ్చే విధంగా మన సీత రామచంద్రస్వామి రథోత్సవాన్ని ఇంకా అభివృద్ధి పథంలో నడిపించడానికి జాతర అభివృద్ధికి పెద్ద ఎత్తున భక్తజనం పెరిగారని ఇంకా మన దేవుడి జాతరకు ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటామని అన్నారు. అదేవిధంగా ఉపసర్పంచ్ కాయితి శ్రీనివాస్ రెడ్డి మాటల్లో గతం కంటే జాతర ఇప్పుడు కొంత మెరుగైందని ఇంకా మన గ్రామంలో శ్రీ కోటగట్టు సీతారామచంద్రస్వామి జాతర మహోత్సవాలను ఘనంగా జరిపే విధంగా చూస్తామని యువకులు స్వామివారి రథాన్ని లాగుతూ కేరింతలు కొడుతూ శ్రీరామ నామస్మరణతో జైశ్రీరామ్ జైశ్రీరామ్ అనే నామస్వరనతో కన్నుల విందుగా అటు ఇటు రథాన్ని లాగుతూ ఉత్సవాల్ని ఎంతో అనుభూతిగా వీక్షించారుఅన్నారు.రథోత్సవ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు,గ్రామంలో ఉన్నటువంటి యువజన సంఘాలు, యువకులు,మహిళ భక్తజనం, ఆలయ కమిటీ సభ్యులు,తదితర గ్రామాల నుంచి వచ్చినటువంటి వివిధ భక్తజనం పాల్గొని రథోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

## గ్రో హబ్ కార్యాలయాన్ని సందర్శించిన



## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి గారు

(జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం ఏప్రిల్ 02 : మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి గారు మరియు రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి లి యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లేటి కిరణ్ కుమార్ రామకృష్ణ పురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ లోని నూతనంగా ఏర్పాటు చేసిన గ్రో హబ్ (గ్రోత్ హబ్ ) సంస్థను సందర్శించారు. నూతనంగా వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్న యువతకు మరియు పారిశ్రామికవేత్తలకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన ఈ సంస్థ కార్యకలాపాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ...యువత తమ ఆలోచనలను (ఐడియాస్ ) నిజం చేసుకునేందుకు గ్రో హబ్ వంటి సంస్థలు సరైన మార్గదర్శకత్వం అందించడం శు భపరిణామమని పేర్కొన్నారు.ముఖ్యంగా కంపెనీ రిజిస్ట్రేషన్, డిజిటల్ మార్కెటింగ్, బ్రాండింగ్ మరియు బిజినెస్ మెంటార్‌షిప్ వంటి సేవలు ఒకే చోట లభించడం వల్ల కొత్త వ్యాపారవేత్తలకు ఎంతో సమయం, శ్రమ ఆదా అవుతాయని ఆయన ఆకాంక్షించారు.

# భద్రాద్రి బ్యాంకు రూ 1000 కోట్లతో టర్నోవర్

**: బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి**



ఖమ్మం, ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం గత 29 సంవత్సరాలుగా స్థిరమైన, క్రమమైన అభివృద్ధిని సాధిస్తూ, ప్రతి సంవత్సరం వాటాదారులకు 18 శాతం డివిడెండ్‌ను నిరంతరం చెల్లిస్తూ, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచింది అని భద్రాద్రి బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఆయన "నేటి శుభోదయ" ప్రతినిధి తో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని 8 జిల్లాల్లో 25 బ్రాంచ్‌లతో విస్తరించిన మన బ్యాంక్,2026 మార్చి 31 నాటికి రూ 1000 కోట్ల టర్నోవర్ సాధించడం మన అందరికీ గర్వకారణం అని వివరించారు. ఈ గొప్ప విజయానికి పునాది వేసినవ్యవస్థాపక చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి కి,వ్యవస్థాపక వైస్ చైర్మన్లు సన్నె ఉదయ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, వ్యవస్థాపక డైరెక్టర్ దేవత రాజారావు, గత వ్యవస్థాపక డైరెక్టర్లు గుర్రం ఉమా మహేశ్వర్ రావు, రేఖల భాస్కర్, మద్ది బాబు, అర్వపల్లి నిరంజన్ , సీఈఓ, హెడ్ ఆఫీస్ సిబ్బంది, బ్రాంచ్ మేనేజర్లు, అన్ని సిబ్బందికి మా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయానికి ప్రధాన కారణమైన మన బ్యాంక్ వాటాదారులు, ఖాతాదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విశ్వాసాన్ని కొనసాగిస్తూ, భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లు అధిగమించాలని మనస్ఫూర్తిగా ఆశిద్దాం.

# నేరేడ్ మేట్‌లో ఈఓడబ్ల్యూ పోలీస్ స్టేషన్ ప్రారంభం



నేరేడ్ మేట్, ఏప్రిల్ 02 : నగరంలో పెరుగుతున్న ఆర్థిక మోసాల నియంత్రణకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో నేరేడ్మెట్ సీపీఓలో ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించింది. కమిషనర్ ఆఫ్ పోలీస్ జీడీ ఎంట్రీ నమోదు చేసి అధికారికంగా కార్యకలాపాలను ప్రారంభించారు.ఈ విభాగం ద్వారా భారీ స్థాయిలో జరిగే ఆర్థిక మోసాల కేసులను నమోదు చేసి విచారణ చేపట్టనున్నారు. రూ.2 కోట్లకు పైబడిన మోసాలు, నమ్మకద్రోహం, పత్రాల కుంభకోణాలు వంటి కేసులతో పాటు తెలంగాణ డిపాజిటర్ల రక్షణ చట్టం1999 (2023 సవరణ) కింద రూ.1 కోట్లకు మించిన కేసులను కూడా పరిశీలించనున్నారు. అదేవిధంగా కమిషనర్ ఆదేశాల మేరకు ఇతర ఆర్థిక నేరాలపై కూడా చర్యలు తీసుకోనున్నారు.నేరేడ్మెట్ పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఈ పోలీస్ స్టేషన్‌కు డీసీపీ (రోడ్డు భద్రత) కే. మనోహర్ పర్యవేక్షణ వహించనున్నారు. ఆయనకు తోడుగా అసిస్టెంట్ కమిషనర్లు పి. సత్తయ్య, సి. అంజయ్య, ఇన్‌స్పెక్టర్లు కే. భాస్కర్, ఏ. సూర్య నాయక్, కే. రవి కుమార్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే ఈ విభాగం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

## నాలుగు లేబర్ కోడు చట్టాలను

# వెంటనే రద్దు చేయాలి నడికుడా శివ

**తెలంగాణ రాష్ట్ర అడిషనల్ ఉపాధి కమిషనర్ గంగాధర్ కి మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ కార్మిక శాఖ అధ్యక్షులు నడికూడా శివ వినతి పత్రం**



(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం ఏప్రిల్ 02 : తెలంగాణ రాష్ట్ర అడిషనల్ ఉపాధి కమిషనర్ గంగాధర్ కి మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడా శివ వినతిపత్రం అందజేస్తూ.. అనంతరం శివ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ నారాయణగూడలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడు చట్టాలను వెంటనే రద్దు చేయాలి అని పెద్ద ఎత్తున రాయాలి నిర్ణయించి డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర అడిషనల్ ఉపాధి కమిషనర్ గంగాధర్ వినతి పత్రం అందజేశారు, మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టియుసి కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడి శివ,ఈ సందర్భంగా నడికుడ శివ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ చేస్తున్న నాలుగు లేబర్ కోర్టు చట్టాలను వెంటనే రద్దు చేయాలని అలాగే ఉపాధి పథకం కూడా కొనసాగించాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఐ ఎన్ టి సి నాగన్న గౌడ్,చంద్రశేఖర్,రామకృష్ణారెడ్డి, ఐలేష్ గౌడ్ ,మరియు ఐఎన్టియుసి సంబంధించిన నాయకులు తదిరులు పాల్గొన్నారు

## పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

# సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ



(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం ఏప్రిల్ 02 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కల్వకోల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ మాట్లాడుతూ గ్రామంలో తడి చెత్త పొడి చెత్త పరిశీలిస్తున్నట్టు తెలియజేశారు గ్రామ కార్యదర్శి తో కలిసి గ్రామంలో పరిశుభ్రంగా విధులను ఉంచుకోవాలని చెప్పారు అదేవిధంగా పరిశుభ్రంగా లేకపోతే మనకు అనారోగ్యాల పాలై టైఫాయిడ్ మలేరియా డెంగ్యూ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

## జవహర్ నగర్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం

# చేసిన మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్



ఈస్ట్ ఆనంద్ బాగ్, ఏప్రిల్ 02 : డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో పార్కులో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. కాలనీవాసుల ఆరోగ్యాభివృద్ధి దృష్ట్యా ఈ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, ముత్యం రెడ్డి, కాశి రెడ్డి, జాన్, శ్రీనివాస్ రెడ్డి, వైఆర్‌కే ప్రసాద్, పద్మావతి, మల్లేష్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు .

## అందెల శ్రీరాములు నివాసానికి

# త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి రాక...!



(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం ఏప్రిల్ 02 : త్రిపుర గవర్నర్ శ్రీ నల్లు ఇంద్రసేనా రెడ్డి గ పర్యటనలో భాగంగా ఈరోజు మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు నివాసానికి విచ్చేసిన సందర్భంగా శ్రీరాములు నియోజకవర్గ బిజెపి నాయకులతో కలిసి ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి శ్రీరాములు తో కాసేపు ముచ్చటించి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ గంగాపురం వెంకట్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు శంకర్ రెడ్డి, కడారి జంగయ్య యాదవ్, వీరన్నగారి ధీరజ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్ ముదిరాజ్, జిల్లా మీడియా కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్లు, వివిధ మోర్చాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విభజన హామీలు అమలు చేయాలి

**- తెలంగాణకు న్యాయం చేయండి**

**- లోక్‌సభలో కేంద్రాన్ని నిలదీసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**

**- బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి**

**- ఖమ్మం, పాలమూరును పట్టించుకోండి**

**- భద్రాచలం నుంచి ఆంధ్రా లో కలిసిన నాలుగు గ్రామపంచాయతీలను తిరిగి ఇచ్చేయండి**

**- కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేసి, కేటీపీఎస్ విస్తరణ పై దృష్టి సారించాలని గళమెత్తిన రామసహాయం**



న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం2014 అమలుపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో బుధవారం గళమెత్తారు. విభజన సమయంలో తెలంగాణ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సంస్థాగత, ఆర్థిక, మౌలిక రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

### - హామీలు కాగితాలకే పరిమితం కావద్దు

విభజన చట్టంలో తెలంగాణ అభివృద్ధి కోసం అనేక హామీలు, కట్టుబాట్లు ఉన్నప్పటికీ, వాటి అమలు ఇంకా పూర్తికాలేదని రఘురాం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హామీలు కాగితాలకే పరిమితం కాకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### - జాతీయ స్థాయి విద్యాసంస్థలు అవసరం

తెలంగాణలో ఎన్ఐటీ (ఎన్ ఐటీ), ఐఐఎం (ఐఐఎం), ఐఐఎస్ఇఆర్ (ఐఐఎస్ఈఆర్), సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ఉన్న విద్యాసంస్థలను జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలని సూచించారు.

### - పారిశ్రామికాభివృద్ధి, ఐటీ విస్తరణ

ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇవ్వాలని, హైదరాబాద్ ఇప్పటికే ఐటీ హబ్‌గా ఉన్నందున దాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### - ఖమ్మం జిల్లా ప్రస్తావన

మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సెక్షన్ 94(2) కింద రావాల్సిన ఆర్థిక తోడ్పాటు ఇంకా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### - బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఎప్పుడు..

సెక్షన్ 93 ప్రకారం బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు హామీ ఇంకా నెరవేరలేదని పేర్కొంటూ దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.

### - నీటి వనరులపై న్యాయం

గోదావరి, కృష్ణా నదులు తెలంగాణలోనే అత్యధికంగా ప్రవహిస్తున్నందున, రెండు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నది యాజమాన్య బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కోరారు.

### - కేటీపీఎస్ కు సంబంధించి

కేటీపీఎస్ (కేటిపిఎస్) థర్మల్ పవర్ స్టేషన్‌కు అదనంగా 825 మెగావాట్ల సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి

### - రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) కోసం అదనపు నిధులు కేటాయించాలని కోరారు.

### - కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ కావాల్సిందే

వరంగల్‌కు విమానాశ్రయం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, కొత్తగూడెం ఆదిలాబాద్, పెద్దపల్లి ప్రాంతాల్లో కూడా విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.

### - భద్రాచలం గ్రామాల సమస్యపై

రెండో సవరణలో భద్రాచలం అసెంబ్లీ పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని కోరారు.

### --- ఏపీ సోదర, సోదరీమణులారా

అది బ్లాక్ డే కాదు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి చక్కటి అవకాశం ఆంధ్రప్రదేశ్ సోదర సోదరీమణులరా అని పేర్కొని ప్రత్యేకంగా విన్నపం చేస్తూ రాష్ట్ర విభజనను ఒక చీకటి రోజుగా చూడవద్దని సూచించారు. ఇది రెండు రాష్ట్రాల అభివృద్ధికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు.

### - సమాన న్యాయం చేయాలి

ఆంధ్రప్రదేశ్‌కు అదనపు నిధులు ఇవ్వడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే అదే విధంగా తెలంగాణ అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. రెండు రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందేలా చూడాలని సూచిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# లేబర్ కోడులుకార్మికుల మెడకు ఉరి తాళ్ళు..

**కార్మికులకు మరణ శాసనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం.**

**పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం.**

**బ్లాక్ డే సందర్భంగా నిరసన ర్యాలీ**

**పెబ్ పెన్నార్ ఎంప్లాయిస్ యూనియన్**

**అధ్యక్షులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్.**





సదాశివపేట ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులు అమలు అయితే కార్మికుల మెడకు ఉరితాడులా మారుతాయని తక్షణమే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని పెబ్బు పెన్నార్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈరోజు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నేడు బ్లాక్ డే సందర్భంగా ఆత్మ మద్దికుంట చౌరస్తాలో ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఏం నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి వి ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నేడు బ్లాక్ డే సందర్భంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబరఎశీంవ రద్దు చేయాలని బ్లాక్ డేగా ఈరోజు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయడం ద్వారా కార్మికులకు పూర్తిస్థాయి బానిసలుగా మార్చేందుకు పెట్టుబడుదాలకు ఊడిగం చేసేందుకు లేబర్ కోర్టులు తెచ్చిందని అన్నారు. కార్మికులకు నష్టం తెచ్చే ఈ లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు దేశంలో ఉన్న గుప్పెడు మంది పెట్టుబడుదాల కోసం కొట్లాను కోట్ల మంది కార్మిక వర్గాన్ని బలి చేయడం సరైనది కాదన్నారు . కార్మిక చట్టాలను నియంతృత్వంగా దౌర్జన్య పూర్తంగా కేంద్ర ప్రభుత్వం తమ తన చేతుల్లోకి తీసుకొని మార్చివేసింది ఇది రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే రాజ్యాంగ వ్యతిరేక చర్య అని అన్నారు. బ్రిటిష్ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం యూనియన్ల ఏర్పాటు కార్మిక హక్కుగా పొందారు . కానీ లేబర్ కోడితో కార్మికుల సంఘం పెట్టుకుని హక్కు సంఘటితమైన హక్కు నిరసనలు సమ్మె చేసే హక్కులపై ఉక్కు పాదం మోపారు ఉద్యోగ భద్రత పట్ల యజమానులకు అన్ని బాధ్యతలను తొలగించారు. 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచే పద్ధతి ఉందన్నారు తక్షణమే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ ఎశీంం రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మల్లేశం పెబ్బు పెన్నార్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నీలం మల్లేశం నాగరాజు శ్రీరామ్ మూర్తి ,జావిద్ తదితరులు పాల్గొన్నారు

# జగద్గిరిగుట్టలో విద్యార్థినులకు ఘన వీడ్కోలు




శామీర్ పేట , ఏప్రిల్ 02 :తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు.శామీర్ పేట కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఇష్రత్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసి బయటకు వెళ్తున్న విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని సాధించాలని సూచించారు. తమ విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఎక్కడ ఉన్నా కళాశాల ప్రతిష్ఠను నిలబెట్టాలని మార్గనిర్దేశం చేశారు.కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. మూడవ సంవత్సరం విద్యార్థినులు తమ అనుభవాలను పంచుకొని భావోద్వేగంగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉప ప్రధానాచార్యులు డాక్టర్ స్రవంతి, అకాడమిక్ ఉప ప్రధానాచార్యులు ఎం. గీత, సాంస్కృతిక సమన్వయకర్త ధనవేణి, అధ్యాపక బృందం, కార్యాలయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




# శ్రీ వీరాంజనేయ స్వామి పూజలు,స్వామివారికి అభిషేకాలు,డోలారోహణం, పూజా కార్యక్రమం



సదాశివపేట ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ ఫైల్) : సదాశివపేటలో హనుమాన్ నగర్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో భట్కరి ప్రభు ఆధ్వర్యంలో మందిరంలో పూజలు, స్వామివారికి అభిషేకాలు, డోలారోహణం, పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ భట్కరి ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, సాయంత్రం హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆశీస్సులు పొందాలని భట్కరి ప్రభు మరియు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# వికారాబాద్ అభివృద్ధి ఎక్కడ.. మాటలే గానీ పనులు కనిపించడంలేదు అన్న పట్టణ ప్రజలు

**ట్రాఫిక్ సిగ్నల్ డివైడర్ కరవు డ్రైనేజ్ వ్యవస్థ అధ్వానం టూరిజం అభివృద్ధి ఎలా**

**కన్యాలాల్ బాగ్ రోడ్ దుస్థితి**



(జర్నలిస్ట్ ఫైల్) వికారాబాద్ ఏప్రిల్ 02 : వికారాబాద్ జిల్లా ప్రధాన పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ చెబుతున్నాడ రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న వేళ నేల మీద పరిస్థితి మాత్రం మారలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక జిల్లాగా గుర్తింపు పొందాల్సిన వికారాబాద్ పట్టణంలోనే మౌలిక సదుపాయాలు దారుణంగా ఉండటంతో "ఇలా ఉంటే టూరిజం ఎలా అభివృద్ధి చెందుతుంది?" అనే సందేహాలు ప్రజల్లో పెరుగుతున్నాయి.పట్టణంలో మోరీలు, డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిగా పాడైపోయిందని ప్రజలు చెబుతున్నారు. చాలా చోట్ల మోరీలకు పైకప్పులు లేకపోవడం, కొన్ని చోట్ల పూర్తిగా మూసుకుపోవడంతో వర్షం పడితే రోడ్లపైకి మురుగు నీరు పొంగిపొర్లుతోంది. త్రాగునీరు సరఫరా చేసినప్పుడు కూడా డ్రైనేజ్ సరిగా లేక నీరు రోడ్లపైకి రావడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఇది ఆరోగ్య సమస్యలకు కూడా దారి తీస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పట్టణంలోని 31వ వార్డు ఆర్ఎస్ఎస్ భవన్ రోడ్ మరియు 29వ వార్డు కన్యాలాల్ బాగ్ సిద్ధార్థ జూనియర్ కాలేజీ ఉన్న రోడ్ పూర్తిగా దెబ్బతిన్నదని ప్రజలు చెబుతున్నారు. గుంతలు, నీటితో నిండిపోయిన ఈ రోడ్‌పై విద్యార్థులు, స్థానికులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంస్థల ప్రాంతంలోనే ఇలాంటి పరిస్థితి ఉండటం పై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఎన్టీఆర్ చౌరస్తా ట్రాఫిక్ గందరగోళం సిగ్నల్స్ లేవు, డివైడర్ లేదుపట్టణంలోని ముఖ్యమైన ట్రాఫిక్ పాయింట్ అయిన ఎన్టీఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. బీజేఆర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు డివైడర్ లేక వాహనాలు ఎటు వైపు వస్తున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రోజూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు.పర్యాటక పట్టణం అవుతుందా.. ప్రజల్లో పెరుగుతున్న సందేహాలు అనంతగిరి కొండలు వంటి పర్యాటక ప్రాధాన్యత ఉన్న ప్రాంతానికి గేట్‌వే అయిన వికారాబాద్ పట్టణంలోనే మౌలిక సదుపాయాలు లేకపోతే పర్యాటక అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనులు మాటల్లోనే మిగిలిపోతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు."మాటలు చాలించండిడ పనులు మొదలుపెట్టండి" ఇదే ప్రస్తుతం వికారాబాద్ పట్టణ ప్రజల స్వరం.

# మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాతృమూర్తికి కేఎల్ఆర్ నివాళి

**హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో దశదిన కర్మ**

**గుమ్మడవెల్లి, ఆకులమైలారంలో పార్టీ నాయకుల మృతికి సంతాపం**



(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి విస్తృతంగా పర్యటించారు.ఉదయం తొలుత ఆర్కేపురం డివిజన్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఈసందర్భంగా బీజేపీ నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ లో చేరారు.అనంతరం గుమ్మడవెల్లిలో జరిగిన ఉపసర్పంచ్ తమ్ముడి వివాహ శుభకార్యానికి కాంగ్రెస్ నేతలతో లక్ష్మారెడ్డి హాజరయ్యారు. తరువాత గుమ్మడవెల్లి, ఆకులమైలారంలో మృతి చెందిన పార్టీ నాయకుల పార్థీవదేహానికి నివాళులు. అర్పించారు. హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో.. మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాతృమూర్తి చంద్రకళ గారి దశదిన కర్మలో పాల్గొన్నారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.ఈకార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవాళి కోసం జీసస్ మహాత్యాగం



- అదే గుడ్ ఫ్రైడే సందేశమన్న ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :కరుణామయుడైన ఏసు ప్రభువు జీవితమే త్యాగపూరితమని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల కోసం ప్రభువు శిలువ ధరించిన రోజే గుడ్ ఫ్రైడే అని ఆయన తెలిపారు. ఇది యావత్ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన ఘట్టమని ఆయన పేర్కొన్నారు. మనుషులపై ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, నిస్వార్థ జీవనం.. ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా ఈ లోకానికి జీసస్ ఇచ్చిన సందేశాలని ఆయన వివరించారు.

## ప్రజాసేవ జీవితం నాకెంతో తృప్తినిచ్చింది



- మల్లెపల్లి సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి

బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ): ప్రజాసేవ చేస్తూ ప్రజల అభ్యున్నతకు కృషి చేస్తూ ప్రజలకు నిత్యం సేవలందించిన నా ఐదు సంవత్సరాల జీవితం నాకెంతో తృప్తినిచ్చిందని మల్లెపల్లె సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి పేర్కొన్నారు ఐదు సంవత్సరాల సర్పంచుల పదవీకాలం నేటితో ముగియడంతో బ్రహ్మంగారి మఠం మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమెకు ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఎంపీడీవో రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఘనంగా సత్కరించారు సందర్భంగా మల్లెపల్లి సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల పాటు మల్లెపల్లె పంచాయతీ ప్రజలకు తాను చేసిన సేవలు నాకెంతో తృప్తినిచ్చాయని పదవీకాలం ముగిసిన కూడా మా పంచాయతీ ప్రజలకు ఏ సమయంలో అయినా ఎటువంటి కష్ట వచ్చిన తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజాసేవ చేయడం నా పూర్వజన్మ సుకృతమని సర్పంచ్ గా నాకు అవకాశం ఇచ్చిన మా నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తెలుగుదేశం పార్టీకి ఎల్లవేళలా రుణపడి ఉంటారని ఆమె పేర్కొన్నారు.

## జనసేన అమరావతి దీపావళి వేడుక



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ప్రజల రాజధాని అమరావతి కి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడం పట్ల జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు తమ ఆనందాన్ని వ్యక్తం చేసి దీపాలు వెలిగించి దీపావళి వేడుక నిర్వహించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి, విజయవాడ కనకదుర్గమ్మ గుడి, పాలకమండలి డైరెక్టర్, తోటకూర వెంకటరమణ రావు మాట్లాడుతూ విభజన తర్వాత, ఆంధ్రప్రదేశ్ కు రాజధాని ఏర్పాటు చేసే అవకాశం, అప్పటి తెలుగుదేశం పార్టీకి లభించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎంతో దూరదృష్టితో, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఎంపిక చేసి, భూమిపూజ చేశారని,ఆ తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం అమరావతిని విధ్వంసకరంగా నాశనం చేసే కుట్ర చేసిందన్నారు. తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, అమరావతి రైతులకు, ఆసమయంలో అండగా నిలిచి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అనే విధానాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారని, కూటమి ప్రభుత్వంలో,రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడం హర్షినీయమన్నారు.

మాజీ కౌన్సిలర్లు మానస రెడ్డి, గుమ్మడి రమేష్ లు అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై తమ అభిప్రాయాలు మీడియాతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని రాంబాబు, ఇస్మాయిల్ బేగ్, జనసేన పార్టీలోని వివిధ స్థాయి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# రైతుల దీక్ష, సీఎం దక్షతే అమరావతి : ఎమ్మెల్యే నసీర్

- ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో గుంటూరులో మార్మోగిన జై అమరావతి నినాదం
- ఆంధ్రుల ఆత్మగౌరవమే రాజధాని ప్రాంతం
- వైసీపీ పాలనలో అమరావతిలో విధ్వంసం
- నేడు అభివృద్ధికి కేరాఫ్‌గా రాజధాని
- పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు చేతులెత్తి నమస్కరిస్తున్నా..
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- అమరావతికి మద్దతుగా గుంటూరులో భారీ ర్యాలీ




గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :అమరావతి రైతుల దీక్ష, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దక్షతే ఆంధ్రుల రాజధాని అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై గురువారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో నగరంలోని హిమని సెంటర్ నుంచి బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ ఐలాండ్ వం-కు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో జై అమరావతి.. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదం అమరావతి అని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాటతో అమరావతి రాజధానిని ధ్వంసం చేసిందని మండిపడ్డారు. ఒకవైపు శ్మశానాలంటూ, మరోవైపు వేశ్యలంటూ రాజధానిని అవమానించారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దక్షతతో అమరావతి రాజధాని ప్రపంచ ఖ్యాతి పొందేలా రూపుదిద్దుకుంటుందని, ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత రావడం శుభ పరిణామం పేర్కొన్నారు. అమరావతి రాజధానిలో క్వాంటం వ్యాలీ, ఐకానిక్ భవనాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, సీడ్ యాక్సెస్ రోడ్లు, ఇన్నర్ రింగ్ రోడ్లు వంటి అభివృద్ధి పనులు త్వరితగతంగా సాగుతున్నాయని తెలిపారు. అమరావతి రాజధాని కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదని, రాష్ట్ర నలువైపులా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు రాజధాని నిర్మాణం అంటే కేవలం భవనాలు మాత్రమే కాదని, మన బిడ్డల భవిష్యత్తు అని స్పష్టం చేశారు, లక్షల కోట్ల పెట్టుబడులతో అమరావతి ప్రాంతానికి కంపెనీలు రానున్నాయని, ఇది ఆంధ్రులు గర్వించదగిన విషయమని చెప్పారు. ఇప్పటికే అమరావతి రాజధాని ప్రాంతంలో హైకోర్టు, ఎంపీ, ఎమ్మెల్యేల క్వార్టర్స్ తోపాటు ఎస్ఆర్ఎం వంటి యూనివర్సిటీలు, ఎయిమ్స్ వంటి వైద్య సౌకర్యాలు వచ్చాయని వివరించారు. ఇలాంటి అభివృద్ధిని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఇకపై అమరావతిని కొంచెం కూడా కదిలించలేరని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ కు రాజధాని ఏది అని అడిగితే గూగుల్ కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు ఆంధ్రులు తలెత్తుకొని తమ రాజధాని అమరావతి అని చెప్పే విధంగా బిల్లు తీసుకొచ్చారని తెలిపారు. అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ డేగల ప్రభాకర్ జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తిరువులూరి పద్మావతి, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్లు, డ్రైన్లలో వ్యర్థాలు వేస్తే అపరాధ రుసుము విధిస్తాం

- నగర కమిషనర్ హెచ్చరిక



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :గుంటూరు నగరంలో ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా రోడ్లమీద, డ్రైన్లలో వ్యర్థాలు వేసే వారిపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ కె.మయూర్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం సమీక్షా సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగర ప్రజలు మరియు సంస్థలు నగర పరిశుభ్రతకు సహకరించాలని, ప్రజారోగ్యానికి భంగం కలిగేలా రోడ్లు, డ్రైన్లలో చెత్త వేయకుండా ప్రజారోగ్య కార్మికులు, కమర్షియల్ చెత్త సేకరణ వారికే అందించాలన్నారు. ప్రజారోగ్య అధికారులు మరియు కార్యదర్శులు తమ ప్రాంతాలను స్వచ్ఛ ప్రాంతాలుగా ప్రకటించుకునేలా పిన్ పాయింట్ గా పారిశుధ్య పనులు జరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్వచ్ఛత పై అధిక ప్రాధాన్యతనిస్తూ, స్వయంగా ముఖ్యమంత్రే సాసా వంటి కార్యక్రమాలలో నేరుగా పాల్గొంటున్నారన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఇప్పటికే సూపర్ లీగ్ సిటీ స్థానాన్ని కైవసం చేసుకుందని, ఆ స్థానాన్ని నిలబెతుకునేలా ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నూతన నిబంధనల మేరకు వ్యర్థాల విభజన పై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలని, డెప్యూటీ కమిషనర్లు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి వార్డులో ప్రస్తుతం ఉన్న ఆర్ ఆర్ ఆర్, క్లస్టర్ కంపోస్ట్ బిన్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారం రోజుల కాల వ్యవధిలో భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని తదుపరి ఎవరైనా వేస్తె అపరాధ రుసుము విధించాలన్నారు. ప్రతి డివిజన్లో గ్యాంగ్ వర్క్ డ్రైన్ల శుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ కోసం డాగ్ క్యాచర్స్ వార్డులోకి వచ్చినప్పుడు కార్యదర్శులు మరియు ఇన్స్పెక్టర్లు సమన్వయం చేసుకోవాలన్నారు.

సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డిప్యుటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, జి. సాంబశివరావు, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, వియస్ డాక్టర్ నాగేశ్వరావు, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మన్నవ కార్యాలయం వద్ద వెల్లువెత్తిన దీపహారతుల కార్యక్రమం

- భారీగా పాల్గొన్న తెదేపా కార్యకర్తలు



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఉభయసభలు పునర్విభజన చట్ట సవరణ బిల్లును ఆమోదించిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని, గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ శ్రీ మన్నవ మోహనకృష్ణ పార్టీ కార్యాలయం వద్ద ఆనందంతో గురువారం రాత్రి దీపాలు , దీపహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ.. అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడం ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షల విజయమని, ఇది ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన చారిత్రాత్మక ఘట్టమని కొనియాడారు. గత పాలకులు మూడు రాజధానుల పేరుతో సృష్టించిన గందరగోళానికి తేర పడిందన్నారు, అభివృద్ధికి అమరావతి ఒక్కటే ఏకైక మార్గమని కేంద్రం స్పష్టం చేసిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని స్పష్టం చేశారు. అలాగే, ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక పాత్రను ప్రస్తావిస్తూ ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రైతుల త్యాగాలు, మహిళల పోరాట ఫలితమే నేడు అమరావతికి దక్కిన ఈ గౌరవమని, బలమైన రాజధాని నిర్మాణంతో రాష్ట్ర అభివృద్ధి ఇక జెట్ వేగంతో దూసుకుపోతుందని మన్నవ మోహన కృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నగరంలో పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణ కల్పించేలా చర్యలు



- నగర కమిషనర్ ఆదేశం

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :నగరంలోని పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటామని, పార్క్ ల నిర్వహణలో స్థానిక వాకర్స్ కమిటీలు భాగస్వాములు కావాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. గురువారం నగరంలోని శ్యామల నగర్, ఎస్వీఎన్ కాలనీ, జేకేసి కాలేజి రోడ్డు, విద్యానగర్, కృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లోని నగరపాలక సంస్థ పార్కుల్లో పర్యటించి, సదుపాయాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పార్కులను పచ్చదనం పెంపు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటులతో ప్రజలకు ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఇప్పటికే పార్క్ లవారీగా పెండింగ్ అభివృద్ధి పనులను తక్షణం పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. మొక్కలు నాటడం, సంరక్షించడం, శుభ్రం చేయడంలో జిఎంసి పార్క్ సిబ్బంది భాధ్యతగా ఉండేలా ఏడిహెచ్ పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్యంగా పార్కులలో ఎటువంటి వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ప్రతి పార్క్ లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏఈల వారీగా తమ పరిధిలోని పార్క్ లలో చేపట్టాల్సిన పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, పార్క్ ల్లో డ్రైనేజి సిస్టం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పార్క్ ల నిర్వహణలో స్థానిక వాకర్స్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు.

పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, ఈఈ కళ్యాణ రావు, డిఈఈ వెంకటరమణ, ఏడిహెచ్ శాంతి, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సర్పంచులకు ఘనంగా వీడ్కోలు పలికిన ఎంపీపీ & మండల నాయకులు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని 11 పంచాయతీలలోని సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 వ తేదీన ముగిసిన సందర్భంగా మండల కార్యాలయంలో మండల సమావేశం ముగిసిన అనంతరం ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఎంపీడీవో వై రామచంద్రారెడ్డి డిప్యూటీ తాసిల్దార్ జాన్సన్ జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి సింగిల్ విండో చైర్మన్ ఎల్లటూరి సాంబశివరెడ్డి మండల ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ మరియు మండల నాయకుల సమక్షంల మండల అధికారులు సమక్షంలో ఘనంగా పూల మాల వేసి బిషాలు వతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీపీ వీర నారాయణరెడ్డి మాట్లాడుతూ సర్పంచులు వారి పదవీకాలం అంతయు ఆ యా పంచాయతీల్లో మెరుగైన సేవలందించారని ప్రసంగించారు.

# ప్రజా సమస్యల పైన అధికారులు దృష్టి పెట్టాలి : ఎంపీపీ వీరనారాయణరెడ్డి



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):బ్రహ్మంగారి మఠం మండలంలోని 14 సచివాలయాల వారిగా 11 గ్రామ పంచాయతీల లో ఉన్న గ్రామాల వారిగా ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని సర్పంచ్ పదవీకాలం ముగించడంతో అధికారులు ప్రజా సమస్యల పైన ప్రత్యేకంగా దృష్టి పెట్టి గ్రామాలలో పరిశుద్ధం తాగునీటి వివిధ రకాల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలని ఆయన పేర్కొన్నారు అందులో భాగంగానే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మండల అభివృద్ధి అధికారి వై రామచంద్ర రెడ్డి మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్ణయించారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ మండలంలోని 14 సచివాలయం వారిగా గ్రామాలలో సమస్యలను నేలత్తకుండా సమస్యలపైనే పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఈనెల 25 నుండి బ్రహ్మంగారి బ్రహ్మోత్సవాలను ప్రారంభమవుతాయని పరిశుద్ధ పనులు తాగునీటి సమస్యలు పైనే ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు అదేవిధంగా శాఖల వారీగా అధికారులతో సమావేశంలో చర్చించారు పెండింగ్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు రైతు యూరియా సమస్యలు పైన చర్చించారు గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో మార్పులు పెండింగ్లో ఉన్న బిల్లులు పంచాయతీ రాజ్ శాఖలో బిల్లులు పైన చర్చలు కొనసాగాయి అంగన్వాడి కేంద్రాలలో పోషక ఆహారం పైన అధికారులతో సమీక్ష చర్చించారు రెవెన్యూ సమస్యలపై డిప్యూటీ తాహశీల్దార్ తో చర్చించారు ప్రస్తుతం గోల్డెన్ సర్వేలో అధికారులు సర్వే లను పక్కాగా డేటాను సేకరించడం జరిగిందని సర్వే ద్వారా రైతులకు సమస్యలను పరిష్కరించేందుకే గోల్డెన్ సర్వే చేపట్టడం జరిగిందని దీనిద్వారా సమస్యలను పరిష్కారం జరుగుతాయని ఆయన తెలిపారు, మత్స్యకార శాఖలో జరుగుతున్న అవినీతిపై సమావేశంలో వాడివేడిగా శాఖ అధికారులతో ఎంపీపీ చర్చించారు దీనిపైన మీడియా ప్రతినిధులతో మత్స్యకార శాఖ అధికారుల కాంట్రాక్టర్ల చేతివాటంతో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టే విధంగా చూడాలని మీడియా ప్రతినిధులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు అధికారులపై ఎంపీపీ మండిపడ్డారు శాఖల వారీగా అధికారులు విధులు నిర్వహించాలని అవినీతికి ఆస్కారం కల్పించకుండా ప్రజలకు సేవ చేసే విధంగా చూడాలని ఎవరైనా విధుల్లో ప్రజలకు అన్యాయం చేస్తే సహించమని ఎంపీపీ వారిని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో, డిప్యూటీ తాహశీల్దార్ జాన్సన్, డిప్యూటీ డిఎంహెచ్వో, మల్లేష్ తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, కానాల మల్లికార్జునరెడ్డి సోమిరెడ్డి పల్లె సహకార పరపతి సంఘం చైర్మన్, యల్లటూరి సాంబశివరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో, శ్రీనివాసులు, విజయభారతి, మండల విద్యాశాఖ అధికారులు పుల్లయ్య వెంకటేశ్వర్లు, సిడిపిఓ, ముంతాజ్ బేగం, సూపర్వైజర్, ప్రత్యూష, పంచాయతీ సర్పంచులు కార్యదర్శులు ఎంపీటీసీలు వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# జై అమరావతి నినాదాలతో హోరెత్తిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గం

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర ర్యాలీ
- రాజధానికి పట్టిన గ్రహణం వీడిందంటూ దీపాలు వెలిగించిన పార్టీ నేతలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించిన సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర ర్యాలీ నిర్వహించగా, "జై అమరావతి" నినాదాలతో ప్రాంతం మార్మోగింది. లాడ్జి సెంటర్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు భారీగా ర్యాలీ సాగింది. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

రాజధానికి పట్టిన గ్రహణం వీడిందని పేర్కొంటూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ తదితర పార్టీ నేతలతో కలిసి దీపాలు వెలిగించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ అమరావతి రాజధాని చట్టబద్ధత సాధన ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

పార్లమెంట్ సాక్షిగా అమరావతిని రాజధానిగా ఆమోదించడం ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి పొట్టి శ్రీరాములు గారి త్యాగం ఎంత ముఖ్యమో, అమరావతి సాధనలో రైతులు, మహిళలు చేసిన పోరాటం కూడా అంతే గొప్పదని అన్నారు.

వేలాది ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులకు ఈ రాజధాని అంకితమని, ఉద్యమంలో మహిళలు, రైతులు ఎదుర్కొన్న కష్టాలు, దాడులను తట్టుకుని పోరాటం కొనసాగించిన తీరును స్మరించుకున్నారు. ఇప్పటి వరకు పిల్లలకు రాజధాని గురించి స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉండేదని, ఇకపై ఎటువంటి సందేహం లేకుండా "అమరావతే రాజధాని" అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి వచ్చిందన్నారు.

రాష్ట్ర ప్రజలందరూ అమరావతికి సంఘీభావం తెలుపుతూ సాయంత్రం తమ ఇళ్లలో దీపాలు వెలిగించాలని, ఈ రోజును నిజమైన దీపావళిలా జరుపుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

అమరావతి రాజధాని చట్టబద్ధతతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఆనందోత్సాహాలతో కళకళలాడగా, ప్రజలు, నాయకులు కలిసి ఘనంగా సంబరాలు జరుపుకోవడం విశేషంగా నిలిచిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## విజయానికి తొలి అడుగు - విద్యార్థులకు మార్గదర్శక సదస్సు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక నిర్మల ఫార్మసీ కళాశాలలో బుధవారం బి.ఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం అలుమ్ని సెల్ ఆధ్వర్యంలో మార్గదర్శక సదస్సు నిర్వహించారు. భవిష్యత్ విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హిందూ ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న, నిర్మల ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి డి. అభిలాష హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బి.ఫార్మసీ అనంతరం అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై సమగ్రంగా వివరించారు. సమయపాలన ప్రాముఖ్యతను తెలియజేస్తూ, భవిష్యత్ లక్ష్యాన్ని ఇప్పుడే నిర్ణయించి దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి మాట్లాడుతూ, ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అలుమ్ని సెల్ కోఆర్డినేటర్ డా. యు. స్పందన, వి. జోజి బాబు లను అభినందించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి డి. అభిలాషను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



**కడప (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక ఎన్జీవో కాలనీలోని ద మాస్టర్ మైండ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేతో పాటు రెండవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సందడి, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ద మాస్టర్ మైండ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అకడమిక్ జోనల్ మేనేజర్ డి. బాలకిషన్ హాజరై కిండర్ గార్టెన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కడపలో లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్ రెండవ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాల ద మాస్టర్ మైండ్స్ ప్రైమరీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ అవుతూ, మొదటి మరియు రెండో తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ మెట్రోపాలిటన్ స్థాయి ప్రాథమిక విద్యా పద్ధతులను కడప నగరంలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలు, పాటలు, నృత్యాలతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు.

ప్రత్యేక అతిథిగా మోటివేషనల్ స్పీకర్ బి. వినోద్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల సెంటర్ హెడ్ రాయ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బ్రిడ్జి కోర్సును సద్వినియోగం చేసుకోవాలి



- విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు స్టడీ మెటీరియల్‌ను అందించాలి

**ఘంటసాల (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదవబోయే విద్యార్థులకు ముందస్తుగా బ్రిడ్జి కోర్సు అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ఘంటసాల లోని క్రిస్టియన్ పేటకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన సురేష్ బాబు బ్రిడ్జి కోర్సు గురించి విద్యార్థులతో సంభాషించారు. కోర్సు అభ్యసిస్తున్న విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాల్లో అమలు చేస్తున్న బ్రిడ్జి కోర్సు ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు దీటుగా పరీక్షల్లో రాణించాలంటే ఈ తరహా ముందస్తు బోధన అవసరమన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు కూడా బ్రిడ్జ్ కోర్సులో భాగస్వామ్యం చేయాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ ద్వారా చదివిన అంశాలను పునఃశ్చరణ చేసుకోవడానికి ప్రభుత్వం స్టడీ మెటీరియల్ ను సమకూర్చాలని కోరారు. మొబైల్ లలో ఆన్లైన్ సబ్జెక్టు లింకులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు డి. కోటయ్య,మెరుగు వేణుగోపాలరావు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజారాజధానిగా అమరావతి : మంత్రి అచ్చెన్నాయుడు

- అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టం
- 1600 రోజుల పోరాటం... రైతులు, మహిళల దీక్షకు గౌరవం
- మూడు రాజధానుల గందరగోళం... రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిన గత పాలన
- సీఎం చంద్రబాబు దూరదృష్టి... ప్రపంచ స్థాయి అమరావతి నిర్మాణం
- పీఎం మోదీ సంకల్పం... వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రజారాజధాని అమరావతి కోసం 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ఇచ్చి దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచారని తెలిపారు. 1600 రోజుల పాటు నిరంతర పోరాటం చేసిన రైతులు, మహిళల ఉద్యమానికి ఆయన సెల్యూట్ చేస్తూ, ఉద్యమ సమయంలో మహిళలను సైతం వదలకుండా జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని తీవ్రంగా ఖండించారు. గత 12 ఏళ్లుగా రాజధానిపై కొనసాగిన అస్పష్టత రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేసిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ అమరావతికి మద్దతు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిన వైఖరిని ప్రజలు గట్టిగా ఎదుర్కొన్నారని, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చెందేందుకు పునాది పడిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం రాష్ట్ర అభివృద్ధికి బలమైన దిశను చూపుతోందని తెలిపారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఇది ఐదుకోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు, రైతుల త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు. రాజధానిపై ఎమ్మెల్యే జగన్ వక్రబుద్ధి ఎప్పటికీ మారదని, రాష్ట్రానికి న్యాయం చేస్తారనే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శిస్తూ, 'మావిగన్' వంటి ప్రతిపాదనలు ఆయన చంచల వైఖరికి నిదర్శనమని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం గత ప్రభుత్వ వైఫల్యాలకు గట్టి సమాధానంగా నిలిచిందని పేర్కొన్నారు. అమరావతి గ్రామాలైన తుళ్లూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి తదితర ప్రాంతాల్లో రైతులు, మహిళలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకోవడం ప్రజల ఆనందానికి నిదర్శనమని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి సువర్ణ భవిష్యత్ అందిస్తుందని, అమరావతి నిత్యశాశ్వత రాజధానిగా నిలుస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

# అమరావతికి చట్టబద్ధతతో పరిపాలనకు స్థిరత్వం

- ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి శాశ్వత రాజధానిగా పార్లమెంట్‌లో చట్టబద్ధత లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ, దీని ద్వారా ఇప్పటి వరకు నెలకొన్న గందరగోళానికి ముగింపు పలికిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానం ఆధారంగా పార్లమెంట్‌లో సవరణ బిల్లుకు ఆమోదం లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు.

ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి తరలివచ్చిన తర్వాత అమరావతిలో స్థిర నివాసం ఏర్పరచుకునేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారని, అయితే మూడు రాజధానుల ప్రతిపాదనతో ఎక్కడ ఉండాలో అర్థంకాక ఆందోళనకు గురయ్యారని చెప్పారు. ప్రస్తుతం ఆ అనిశ్చితి తొలగి, ఇకపై అమరావతి నుంచే పరిపాలన కొనసాగుతుందనే స్పష్టత వచ్చిందని తెలిపారు. దీంతో ఉద్యోగులు ఎలాంటి సందేహాలు లేకుండా పూర్తి స్థాయిలో విధులు నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు.

రాష్ట్రానికి ఉన్న సమస్యలను అర్థం చేసుకుని, పరిపాలనలో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని, రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగులుగా తమ వంతు పాత్ర పోషిస్తామని రామకృష్ణ వెల్లడించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్లమెంట్‌లో విభజన చట్టానికి సవరణలు చేసి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు.

ఇక ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపుతోందని, వారితో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగులకు ఊరటనిచ్చే విధంగా రూ.7 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. తమ పెండింగ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ మేరకు నమ్మకం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధ వ్యవస్థ అవసరం: ఫోర్టో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన అధికార వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఫోర్టో (ఫోరమ్ ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఫోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల్ కొండయ్య సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అనేక ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలను పారదర్శకంగా, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు చట్టబద్ధ వ్యవస్థ అవసరమని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా, ముగ్గురు సీనియర్ మంత్రులు, ఒక విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలని సూచించారు.

ఈ కమిటీ ఉద్యోగుల సమస్యలను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలకు మార్గదర్శకాలు జారీ చేయాలని పేర్కొన్నారు. ప్రతి నెల మొదటి వారంలో కమిటీ సమావేశం నిర్వహించి, ఉద్యోగుల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

సాధారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గం తమ సమస్యలను నేరుగా ప్రభుత్వానికి చెప్పుకోవడం కష్టమని, చట్టబద్ధ వ్యవస్థ ఉంటే సమస్యల పరిష్కారం సులభమవుతుందని తెలిపారు.

ఈ విధానం అమలులోకి వస్తే ఉద్యోగుల సమస్యలు వేగంగా పరిష్కారం కావడంతో పాటు పరిపాలనపై నమ్మకం పెరిగి, ప్రభుత్వం–ఉద్యోగుల సంబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.

కనీసం సగానికి పైగా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

## రాజధాని అమరావతి అజరామరం



- గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని స్పష్టంగా గుర్తిస్తూ శాసనసభలో తీర్మానం చేసి, అనంతరం పార్లమెంట్ ఉభయసభల్లో చట్టబద్ధత కల్పించిన నిర్ణయాన్ని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహ్మద్ జాని పాషా, ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు సంయుక్త ప్రకటనలో సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

అమరావతి రాష్ట్ర అభివృద్ధి, సమతుల్య పరిపాలన, ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం కేవలం నగర నిర్మాణం మాత్రమే కాదని, ఐదుకోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో పాటు పార్లమెంట్‌లో చట్ట సవరణ జరగడం ద్వారా రాజధాని అంశంపై నెలకొన్న అనిశ్చితి పూర్తిగా తొలగిపోతుందని, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను గౌరవించి, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో సవరణలకు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించడం రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణమని పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగుల తరఫున అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరఫున అమరావతి రాజధానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, రాజధాని నిర్మాణంలో భాగస్వాములు కావడం గర్వకారణంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా బుల్ల రాజారావును ప్రకటించారు. అలాగే పోతర్లంక కృపామని, కొలికిపూడి మల్లేశ్వరరావును ఉపాధ్యక్షులుగా నియమించారు. కార్యదర్శులుగా మహాలక్ష్మయ్య, శృంగారపాటి వెంకటరత్నం ఎంపికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా రాయపూడి ఏసుబాబు, గట్టుపల్లి అబ్రహం, అధికార ప్రతినిధిగా పిల్లి నాగేశ్వరరావు, కోశాధికారిగా పత్తిపాటి గోపిని ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా చెరుకూరు తిరుపతిరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎస్సీ వర్గాలకు విస్తృతంగా చేరవేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మరొక ముఖ్య అతిథి, జాతీయ స్పైసీస్ బోర్డు సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు కొత్తూరు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. అంత్యోదయ సిద్ధాంతం ఆధారంగా ప్రతి ఎస్సీ కుటుంబ అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందన్నారు.

కార్యక్రమానికి గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్ అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎనుముల నాగేశ్వరరావు, కోస్తాంధ్ర జోనల్ ఇన్చార్జి మేకల లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్, చరక కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేశ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం ప్రొఫెసర్లకు కేంద్ర పరిశోధక ప్రాజెక్టులు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ముగ్గురు ప్రొఫెసర్లకు కేంద్ర ప్రభుత్వ పరిశోధనా రంగ సంస్థల నుంచి రూ.2.88 కోట్ల విలువైన రీసెర్చ్ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ప్రాజెక్టులకు ఎంపికైన ముగ్గురు ఫ్యాకల్టీలు కూడా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ కు చెందిన వారు కావడం విశేషం. రామానుజన్ ఫెలోషిప్ ఫ్యాకల్టీలుగా పేరున్న డాక్టర్ జి. సోమునాయుడు, డాక్టర్ మనీత్ చెట్రిలకు కేంద్ర ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ఒక్కొక్కరికీ రూ.1.19 కోట్ల చొప్పున ఇద్దరికీ కలిపి రూ.2.38 కోట్ల ప్రాజెక్టులు లభించాయి. ఐదేళ్ల వ్యవధిలోగా నిర్దేశించిన పరిశోధనలు పూర్తి చేసి ప్రాజెక్టు వివరాలను వీరు ఏఎన్ ఆర్ ఎఫ్ కు సమర్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా ఉన్న డాక్టర్ మంగళంపల్లి కిరణ్ కుమార్ కు డీఆర్డీవో నుంచి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు లభించింది. ఈ ప్రాజెక్టు కింద విడుదల చేసిన గ్రాంటు విలువ రూ.50 లక్షలు.

సీఐడీఆర్ ఫ్యాకల్టీలు ముగ్గురికీ కేంద్ర రీసెర్చ్ ప్రాజెక్టులు దక్కడం పట్ల యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపాలు సంతోషాన్ని వ్యక్తం చేసి ప్రొఫెసర్లకు అభినందనలు తెలిపారు.

## బీజేపీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి కుమార్తె వివాహ వేడుకలో పీవీఎన్ మాధవ్



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి కుమార్తె సనాతని వివాహం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. నంద్యాల జిల్లా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, వెంకటరెడ్డి దంపతుల కుమారుడు జనార్ధన్ రెడ్డితో ఈ వివాహం నిర్వహించారు.

ఈ వివాహ వేడుకకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ ప్రోగ్రామ్స్ అండ్ ప్రోటోకాల్ ఇన్‌చార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పాతూరి నాగభూషణం, రామినేని ధర్మ ప్రచారక్ పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున పార్టీ నేతలు, బంధుమిత్రులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కొంగాడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్డీఏ మేనిఫెస్టో విడుదల



**కొంగాడ్ (కేరళ)(జర్నలిస్ట్ ఫైల్) :** కొంగాడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) తన ఎన్నికల మేనిఫెస్టోను బుధవారం ఘనంగా విడుదల చేసింది. అన్ని వార్డుల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరైన సభలో మేనిఫెస్టో ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు, హజ్ కమిటీ చైర్మన్ ఏ.పి. అబ్దుల్లకుట్టి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కొంగాడ్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ డాక్టర్ కిలారు దిలీప్ మాట్లాడుతూ, "సబ్కా సాథ్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్" అనే సిద్ధాంతంతోనే ఎన్డీఏ పాలన కొనసాగుతుందని, అదే ఆత్మతో ఈ మేనిఫెస్టో రూపొందించబడిందని తెలిపారు.

**మైనారిటీల సంక్షేమంపై కేంద్ర దృష్టి :** సభను ఉద్దేశించి మాట్లాడిన అబ్దుల్లకుట్టి, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా మైనారిటీ వర్గాల విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రస్తుత పాలనకు ప్రత్యామ్నాయంగా ఎన్డీఏ విశ్వసనీయమైన మార్గాన్ని అందిస్తుందని తెలిపారు.

**కొంగాడ్ అభివృద్ధికి ఎన్డీఏ విజన్ :** డాక్టర్ కిలారు దిలీప్ మాట్లాడుతూ, కొంగాడ్ ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం పలు మార్పు తీసుకొచ్చే పథకాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

పారదర్శక, బాధ్యతాయుత, సమాన పాలనను అందించడం తమ లక్ష్యమని చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి ఫలాలు పొందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కొంగాడ్ మేనిఫెస్టోలో అభివృద్ధి, పారదర్శకత, సమగ్ర వృద్ధి ప్రధాన లక్ష్యాలుగా ప్రతిఫలించాయని, నియోజకవర్గంలోని ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే తమ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

**భారీగా కార్యకర్తల హాజరు :** ఈ కార్యక్రమానికి కొంగాడ్ నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. సీనియర్ నేతలు, స్థానిక నాయకులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సభ విజయవంతమైంది. ఈ ఉత్సాహాన్ని ఎన్నికల ప్రచారంలో కొనసాగించాలని ఎన్డీఏ నేతలు భావిస్తున్నారు.



Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467